

భారత్
# ప్రతినిధి
తెలుగు దిన పత్రిక




సంపుటి: 3 సంచిక: 297 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు గురువారం, 20 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88890

VOLUME: 3 ISSUE: 297 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR THURSDAY, 20 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI


# గ్రూప్-1 పరీక్షలో
# అక్రమాలు కోకొల్లలు

**అనర్హులతో పేపర్లు దిద్దించిన ఘనత ఆనాటి వైసిపిది**

**ప్రైవేట్ ఏజెన్సీలకు పేపర్లు దిద్దే బాధ్యత అప్పగింత**

**ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులకు అప్పగింత**

**అసెంబ్లీలో ఆనాటి దుర్మారగాన్ని ఏకరువు పెట్టిన చంద్రబాబు**



వైకాపా హయాంలో జరిగిన గ్రూప్-1 పరీక్షల్లో భయంకరమైన అక్రమాలు జరిగాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుకున్నారని.. పేపర్లను పూర్తిగా అనర్హులతో దిద్దించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 అక్రమాలపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. 'గ్రూప్-1పై నివేదికలు చూస్తే భయంకరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏపీపీఎస్సీ నియమాలు, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. పేపర్లు దిద్దే బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడమే తప్పు. ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఆమోదం లేకుండా ఏ పనీ చేయకూడదు. పేపర్లు దిద్దడంలో ప్రతి దశలోనూ నిబంధనలు ఉల్లంఘించారు. మిగతా2లో...

# స్థానిక సమరానికి 'సై'



**తాడేపల్లి, భారత్ ప్రతినిధి బ్యూరో :** స్థానిక సంస్థ ఎన్నికల పోరుకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలని.. గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పిలుపునిచ్చారు. వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఈ రెండేళ్లలో ఈ ప్రభుత్వం ఏ ఒక్క వర్గానికీ మేలు చేయలేదని ఎత్తిచూపారు. అందుకే త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో ఆ వ్యతిరేకత కనబడకుండా కుట్రలు చేసే వీలుందని.. అందుకు పోలీసు బలగాలనూ వినియోగించవచ్చని చెప్పారు. వైఎస్సార్సీపీకి అత్యంత ప్రజాదరణ ఉందని.. వచ్చే ఎన్నికల్లో వారే తమకు అండగా ఉంటారని, తోడుగా నిలుస్తారని అన్నారు. వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం కుట్రలను ఎదుర్కొని స్థానిక ఎన్నికల్లో పోరాడాలని.. ఈ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ గెలుపు తథ్యమని పార్టీ శ్రేణులకు ఉద్బోధించారు. 'చంద్రబాబు ఒక విలన్. స్థానిక ఎన్నికలు సరిగ్గా జరగనీయడు. పోలీసులను పెడతాడు. దౌర్జన్యం చేస్తాడు. బెదిరిస్తాడు. ప్రలోభాలు పెడతాడు. ఎన్నికలలో దుర్మార్గంగా గెలిచే ప్రయత్నం చేస్తాడు. కానీ, అందరూ గుర్తు పెట్టుకోండి. మనకు ప్రజలు సపోర్ట్ ఉన్నారు. ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనండి. అన్ని రకాలుగా మీకు పార్టీ సపోర్ట్ ఉంటుంది. మీ జగనన్న సపోర్ట్ ఉంటాడు." అని జగన్ పేర్కొన్నారు. 'వాళ్ళు ఏ రకంగా మేనేజ్ చేసినా, ఏ రకంగా ఒత్తిడి తీసుకొచ్చినా, ఏ రకంగా పోలీసులను పెట్టుకొని ఏం చేసినా కూడా యుద్ధం మాత్రం జరగాలి.' అని అన్నారు. ఒకవేళ పోలీసులను దుర్వినియోగం చేసి, ఆ చిన్న చిన్న స్థానాల్లో సైతం గెలవడం కోసం వాళ్ళు దుర్మార్గాలు చేస్తే మాత్రం రేపు పొద్దున జరగబోయే ఎన్నికల్లో చంద్రబాబుగారి పునాదులు కూడా కదిలే విధంగా కసి పెరుగుతుంది అనేది మాత్రం గుర్తు పెట్టుకోవాలని ఆయన అన్నారు. 'అందుకే కచ్చితంగా గట్టిగా పోటీ ఎదుర్కొందాం. ఎన్ని ఇబ్బందులు పెట్టినా కూడా కళ్ళు మూసుకొని కళ్ళు తెరిచేసరికి ఇంకొక సంవత్సరంలో జగనన్న పాదయాత్ర స్టార్ట్ అవుతుంది అని జగన్ పేర్కొన్నారు.

## ఏపీ మండలి డిప్యూటీ చైర్మన్‌గా వైసీపీ ఎమ్మెల్సీ ఏకగ్రీవ ఎన్నిక



ఆంధ్రప్రదేశ్ మండలి డిప్యూటీ చైర్మన్‌గా వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలిలో టీడీపీ, బీజేపీ, జనసేన సభ్యుల కంటే వైసీపీ సభ్యులు మెజార్టీ సంఖ్యలో ఉండడంతో కూటమి తరుపున ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. దీంతో బుధవారం మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు మండలి చైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారునంతరం మిగతా2లో...


# త్యాగం మీది...
# అండ మాది

**వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం**

**నిర్వాసిత కుటుంబాలకు చెక్కు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**ఇప్పటి వరకూ రూ.518 కోట్లు పరిహారం చెల్లింపు**


2లో


2లో

## ఫోటో జర్నలిస్టుగా చంద్రబాబు

## ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగునీటి సరఫరాపై
# ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**రెండేళ్లలో రూ.25 కోట్లతో 548 పనులు చేపట్టాం**

**రెండేళ్ళలో 1800కోట్లతో పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి**

**చంద్రబాబు ముందుచూపు వల్లే ఏలేరు ఆయకట్టుకు నీరిస్తున్నాం**

**- అసెంబ్లీలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**



ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు సాగు, తాగు నీటి సరఫరా పై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సూచనల మేరకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. బుధవారం అసెంబ్లీలో యల్లసిరి కెనాల్ పనులు, ఏలేరు జలాశయం పరిధిలోని ఆయకట్టుకు నీటి సరఫరాపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నిమ్మల సమాధానం ఇచ్చారు. ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు సమస్యలను పరిష్కరిం చేందుకు అధికారులు, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి క్షేత్రస్థాయిలో ఇటీవలే పరిశీలనలు చేపట్టామని మంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోపు ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు నీరందించాలనే ముందుచూపుతో నాడు చంద్రబాబు పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీంను నిర్మించారని పేర్కొన్నారు. సూపర్ ఎల్‌నినో వంటి క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లోనూ 53 వేల ఎకరాల ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు, 1.48 లక్షల ఎకరాల పుష్కర ఆయకట్టుకు సాగు, తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పోలవరం ఎడమ కాలువ పనులపై రూ.1,800 కోట్లు ఖర్చు చేసి, అత్యంత క్లిష్టమైన మిగతా2లో...

## ప్రత్యక్ష ఎన్నికలతో
# ప్రయోజనాలు

**నేరుగా ఎన్నికైన వారికి ప్రజల్లో ఆదరణ:అసెంబ్లీలో మంత్రి నారాయణ వెల్లడి**


2లో

## ఏపి ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లుకు శాసనసభ ఆమోదం

**సభలో బిల్లును ప్రవేశపెట్టిన న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**


2లో

# 'స్వాప్ దానం'కు అవకాశం

**శాసనసభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**

**మంత్రి ప్రవేశపెట్టిన మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లుకు సభ ఆమోదం**



జీవన్మృతుల ( బ్రెయిన్‌డెడ్ ) వ్యక్తుల అవయవ దానానికి ముందుకొచ్చే కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.10,000 నుంచి ఆర్థిక సాయాన్ని రూ.లక్షకు పెంచే ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లు-2026పై బుధవారం శాసనసభలో ప్రవేశ పెట్టిన సందర్భంగా మంత్రి

మిగతా2లో...

# గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు కోకొల్లలు

(మొదటి పేజీ తరువాయి)

యూనివర్సిటీ ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులతో చేయించారు. ఈ మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌లో వివరాలు షేర్ చేసుకున్నారు. ఇష్టానుసారంగా పేపర్లు దిద్దే అధికారం వీరికి ఎవరిచ్చారని నిలదీసారు. మార్కులు తగ్గించడం.. పెంచడం ఇష్టం వచ్చినట్లు చేశారు. సీఎం ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌కు సెక్రటరీ పోస్టు ఇచ్చారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను కట్టడి చేశారు. అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు. వ్యవస్థలపై నమ్మకం కోల్పోయేలా ప్రవర్తించారు.తొలుత హైదరాబాద్‌లో, రెండోసారి హాయ్‌లాండ్‌లో పేపర్లు దిద్దించారు. హైదరాబాద్‌లో ఎవాల్యుయేషన్ చేసిన వారిలో 25 మంది అనర్హులు. హాయ్‌లాండ్‌లో ఎవాల్యుయేషన్ చేసిన 66 మందీ అనర్హులే. మాన్యువల్ ఎవాల్యుయేషన్ జరగాలి.. డిజిటల్ మూల్యాంకనం వద్దని హైకోర్టు చెప్పింది. భవన నిర్మాణ కార్మికులు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారని ఆనాటి అక్రమలాపై చంద్రబాబు ఏకరువు పెట్టారు. ఫ్రీలాన్సర్ మహంకాళీ రఘురామ్‌ను నియమించారు. 166 మందిలో 50 మంది డిగ్రీ లెక్చరర్లను వినియోగించారు. గ్రూప్-1 జవాబు పత్రాల్లో ఫ్లూయిడ్‌తో తప్పులు దిద్దకూడదు. కానీ.. 55 చోట్ల తప్పులు సరిచేశారు. 49వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు ప్రింట్ చేశారు. గ్రూప్-1 పరీక్షలు రాసిన లెక్చరర్‌ను కూడా పేపర్లు దిద్దేందుకు పిలిచారు. కోర్టులను పక్కదారి పట్టించేందుకు అధికారులతో తప్పుడు అఫిడవిట్లు వేయించారు. ఖర్చుల కోసం రూ.1.14 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో సిట్ ఏర్పాటైందన్నారు. వైకాపా హయాంలో గ్రూప్-1 నిర్వహణ అతిపెద్ద స్కామ్. ఇలాంటి తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి. ఎవరైనా ప్రతిభకు పట్టం కట్టాలి.. పైరవీలకు దూరంగా ఉండాలి. ఇలాంటి తప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాల్సిందేని చంద్రబాబు అన్నారు. చేసింది సరైనదే అని చెప్పే దమ్ము, ధైర్యం వైకాపా నేతలకు ఉందా? ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ప్రతిభావంతులు నష్టపోతారు. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మనందరిదని సీఎం చంద్రబాబు అన్నారు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 315 ప్రకారం ఏపీపీఎస్సీ ఏర్పడిందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర సర్వీసుల్లోకి వచ్చే అధికారులను గ్రూప్-1 పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారని, ఎంతో శ్రమించి అభ్యర్థులు ఉద్యోగాలు సాధిస్తారని చెప్పారు. అలాంటి పరీక్షల్లో గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు.ప్రజలు, ఉద్యోగార్థులు ఈ అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ జవాబుదారీతనానికి వేదిక అని, ఇక్కడి నుంచే ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని తాను చాలాసార్లు చెప్పానని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలోని వివిధ వ్యవస్థలపై ప్రజల్లో విశ్వాసం పోయేలా గత పాలకులు వ్యవహరించారని విమర్శించారు.

# త్యాగం మీది... అండ మాది

వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభోత్సవానికి గడువు దగ్గర పడుతున్న వేళ... నిర్వాసిత గ్రామాల ప్రజలకు పరిహారం అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి త్యాగాలు చేసిన నిర్వాసిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. జూన్ 27న రూ.300కోట్లు అందించిన ప్రభుత్వం బుధవారం ముంపు బాధితులకు మరో రూ.200 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు శాసన సభ ఆవరణలో నిర్వాసిత కుటుంబాలకు రూ.200 కోట్ల చెక్కును అందజేశారు. ఇప్పటి వరకూ వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.518 కోట్లను పరిహారంగా అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతులు, నిర్వాసితులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తోందని వ్యాఖ్యానించారు. మిగతా పరిహారం సొమ్మునూ త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. వెలిగొండ నిర్వాసితులను ఆదుకున్నది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మంచి చేసే ప్రభుత్వాలను గుర్తించాలని అన్నారు. భూములు, ఇళ్లను కోల్పోయిన తమకు ప్రభుత్వం అండగా నిలిచి పరిహారం అందించడం పట్ల నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.రూ.518 కోట్ల మేర పరిహారం అందజేతవెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోతున్న బాధితులకు అన్ని విధాలా అండగా నిలిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నందుకు గానూ ఓటీఎస్ కింద 2,557 కుటుంబాలకు ప్రభుత్వం రూ.318 కోట్ల మేర పరిహారం ఇప్పటికే చెల్లించింది. మరో 1,600 కుటుంబాలకు ఓటీఎస్ కింద రూ.200 కోట్లు పరిహారానికి సంబంధించి చెక్కును బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాసితులకు అందించా రు. దీంతో నిర్వాసితులకు ఇప్పటి వరకు పరిహారం కింద 4,157 కుటుంబాలకు రూ.518 కోట్లను ప్రభు త్వం చెల్లించినట్లైంది. నిర్వాసితుల కోసం 7 పునరా వాస కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. వేములకోట మినహా మిగిలిన 6 కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయి. దీంతో ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు తరలి వెళ్తున్నాయి.

# ఏపి ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లుకు శాసనసభ ఆమోదం

ఆంధ్రప్రదేశ్ ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లు-2026కు శాసనసభ ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన శాసనసభ సమావేశాలు మూడవ రోజున స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రవేశపెట్టారు. మంత్రి ఫరూక్ ప్రవేశపెట్టిన బిల్లులోని ముఖ్యాంశాలను ప్రశంసిస్తూ వాటికి పూర్తి మద్దతు తెలుపుతూ బిల్లును ఆమోదించాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు. ప్రతిపాదనలకు సభ్యుల ఆమోదంతో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ప్రకటించారు.బిల్లును ప్రవేశపెట్టినప్పుడు మంత్రి ఫరూక్ శాసనసభలో బిల్లు ముఖ్య ఉద్దేశంతో పాటు అందుబాటులోకి వచ్చే సులభతరమైన విధానాలను వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లుతో రాష్ట్రంలో విశ్వాస-ఆధారిత నియంత్రణ చట్రాన్ని పెంపొందించుటకు, పౌరుల యొక్క జీవన సౌలభ్యాన్ని మెరుగుపరుచుటకు, మరియు కార్యకలాపాల నిర్వహణను వేగవంతం చేయుటను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం సూచించిన నియంత్రణల సడలింపు, అనుసరణ భారాన్ని తగ్గించే సంస్కరణలను అమలు చేయడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని మంత్రి వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీస్ చట్టం-1999 క్రింద ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అంతర్జాతీయ ప్రమాణాలు మరియు మార్గదర్శకాలు ఆధారంగా ఉండేలా చేసినట్లు, నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు సంబంధించిన ప్రస్తావనలను తొలగించినట్లు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ల పునరుద్ధరణ కోసం థర్డ్-పార్టీ ఫైర్ ఆడిట్ ఏజెన్సీలు అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి, వాటి ఎంపానెల్మెంట్కు సంబంధించిన అర్హతలు, ప్రమాణాలు, విధులు, పర్యవేక్షణ మరియు క్రమశిక్షణా నిబంధనలను చేర్చినట్లు మంత్రి పేర్కొన్నారు.ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ సింగిల్ విండో క్లియరెన్స్ చట్టం-2002 కింద పరిశ్రమలకు సంబంధించిన అనుమతులపై క్రమబద్ధమైన పర్యవేక్షణ, స్పష్టమైన అధికారాలతో పాటు తప్పనిసరి ఎస్కలేషన్ అథారిటీతో కూడిన రాష్ట్ర మరియు జిల్లా కమిటీలతో కూడిన రెండు అంచెల సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ప్రతిపాదించామని వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ చట్టం- 2017 లో సేవలు తిరస్కరించబడినప్పుడు లేదా నిర్ణీత గడువులో అందించనప్పుడు, దరఖాస్తుదారులు తామే స్వయంగా అప్పీల్ దాఖలు చేయాల్సిన అవసరం లేకుండా ఆటో-అప్పీల్ విధానం ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఏదైనా సేవ తిరస్కరించబడినా లేదా నిర్ణీత గడువులో అందించబడకపోయినా, అప్పీల్ స్వయంచాలకంగా దాఖలైనట్లుగా పరిగణించబడుతుందన్నారు. అప్పీలేట్ అథారిటీ 21 రోజుల్లోపు ఆ అప్పీల్‌ను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైతే సేవను అందించమని ఆదేశించడంతో పాటు, పరిహారం చెల్లించాల్సిందిగా కూడా ఆదేశించవచ్చునని పేర్కొంటూ మంత్రి ఫరూక్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును ప్రవేశపెట్టగా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

# నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

- సంస్కరణలపై సుప్రీంలో విచారణ



నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్-2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

# టేబుల్‌పై డీఎంకె అవినీతి ఫైల్స్

**వాటిని అప్పుడే తెరిచేలా చేయకండి**

**తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ సంచలన వ్యాఖ్యలు**

:ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్‌పైనే ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు ఆ ఫైల్స్ తెరుస్తానని స్పష్టం చేశారు. తనను బలవంతం చేసి.. వాటిని ఇప్పుడే తెరిచేలా చేయొద్దని డీఎంకే నేతలకు వార్నింగ్ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై బుధవారం తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి విజయ్ డీఎంకే పార్టీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు ఎప్పుడు.. ఏం చెప్పాలో నాకు తెలుసు. అందుకే ప్రజలు మాపై నమ్మకంతో ఈ స్థానంలో కూర్చోబెట్టారు. ఉప ఎన్నికల సమయంలో నేను మాట్లాడతాను. ప్రజలకు కొంత మంచి జరగనివ్వండి' అని అన్నారు.

# లోక్‌సభ సీట్లు యధాతథంగా కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

విరాళాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పోరాటానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌లు మీడియాకు వెల్లడించారు.

అరుణాలచల్ ప్రదేశ్‌లో చైనా ఆక్రమణలపై కేంద్రం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విదేశీ విధానంపైనా విమర్శలు గుప్పించింది. అనేక అంశాల్లో కేంద్రం వైఫల్యం చెందిందని ఆరోపించిన కాంగ్రెస్.. విద్యార్థులు, యువతతో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 800 నగరాలు, పట్టణాల్లో వీటిని నిర్వహించాలని, కొన్ని చోట్ల రాహుల్ పాల్గొంటారని పేర్కొంది.

# ఏపీ మండలి డిప్యూటీ ఛైర్మన్‌గా వైసీపీ ఎమ్మెల్సీ ఏకగ్రీవ ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

మాధవరావును ఛైర్మన్ స్థానంలో కూర్చోబెట్టి అభినందించారు. ఈ కార్యక్రమానికి కూటమి సభ్యులు ఛైర్మన్ సీటు వద్దకు రాకపోవడంతో మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. కూటమి సభ్యులు సభా సంప్రదాయాలను పాటించడం లేదని ఆరోపించారు. చైర్ పట్ల అగౌరవంగా వ్యవహరించడం మంచిది కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమని, సభా సాంపరదాయాలు, గౌరవాలు శాశ్వతం అని అన్నారు.

# ఫోటో జర్నలిస్టుగా చంద్రబాబు

వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫొటో జర్నలిస్టుగా మారారు. ఫొటో జర్నలిస్టులు అందరిని కలిపి సీఎం గ్రూప్ ఫొటో తీశారు. కెమెరా తీసుకుని తానే ఫొటో తీస్తానని చెప్పారు. వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఫొటో జర్నలిస్టులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఫొటో జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. చరిత్రను నమోదు చేస్తూ.. జ్ఞాపకాలను పదిలపరుస్తున్న ఫొటోగ్రాఫర్లకు సీఎం అభినందనలు తెలిపారు. మానవ అనుభవాలను, అద్భుతమైన చిత్రాలుగా ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు చెప్పారు. మీడియా, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లను కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్ల అంకితభావం, కళాత్మకత, నిరంతర కృషి అభినందనీయమని ప్రశంసించారు.

# ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

పాంపా, తాండవ, ఏలేరు నదుల క్రాసింగ్ పనులతో పాటు 11 హైవే క్రాసింగ్ వంతెనల పనులను పూర్తి చేశామని తెలిపారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీంతో పాటు పోలవరం ఎడమ కాలువ పనులను ముందుకు తీసుకెళ్లడం వల్లే ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగు నీరు అందించే పరిస్థితి ఏర్పడిందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు సాగునీటి అవసరాల కోసం 950 క్యూసెక్కుల నీటిని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏలేరు ఆయకట్టుకు ఇప్పటివరకు 2.6 టీఎంసీల నీటిని పంపిణీ చేశామని మంత్రి వెల్లడించారు. గత ఐదేళ్ల పాలనలో ఏలేరు నదీగర్భంలో జరిగిన అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా బెడ్ లెవల్ పడిపోయిందని, దీంతో గ్రావిటీ ద్వారా నీటిని అందించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో 548 రాడఓ పనులకు రూ.25 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టిందని తెలిపారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఏలేరు ఆయకట్టుకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మరో రూ.15.84 కోట్లతో ఓ అండ్ ఎం పనులకు ప్రతిపాదనలు పంపామని మంత్రి వెల్లడించారు.

# ప్రత్యక్ష ఎన్నికలతో ప్రయోజనాలు

ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్, మున్సిపల్ ఛైర్మన్ ఎంపికతో అనేక ప్రయోజనాలు ఉంటాయని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఎన్నికల్లో నేరుగా ఎంపికైన వారికి బలమైన ప్రజామోదం ఉంటుందని అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం మేయర్, మున్సిపల్ ఛైర్మన్‌పై ఉండదని స్పష్టం చేశారు. వీరిద్దరు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే సుదీర్ఘ అభివృద్ధి ప్రణాళికలు అమలుపరిచే అవకాశం ఉంటుందని అన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు వేగవంతం చేయవచ్చునని చెప్పారు. పెట్టుబడిదారులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని మేయర్, ఛైర్మన్ యాక్టివ్‌గా ప్రమోట్ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాదు.. వీరిద్దరిపై రాజకీయ ప్రభావం తగ్గుతుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకూ అవసరమైన పనులు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. అంతకుముందు అసెంబ్లీలో పురపాలక శాసనాల 4వ సవరణ బిల్లును మున్సిపల్ పరపాలన శాఖ మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన చట్ట సవరణ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దీంతో ఇకపై మేయర్, మున్సిపల్ ఛైర్మన్ ఎంపిక ప్రత్యక్ష ఎన్నికల ద్వారా జరగనుంది. ఇప్పటి వరకూ వీరిద్దరిని పరోక్ష పద్ధతిలో ఎన్నుకుంటున్న సంగతి తెలిసిందే.

# 'స్వాప్ దానం'కు అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. అవయవదానం, ప్రాముఖ్యత, ప్రస్తుత పరిస్థితులు, బిల్లులోని ముఖ్యాంశాల గురించి వివరించారు. ఒక బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి ఎనిమిది అవయవాలను సేకరించి అవసరమైన వారికి అందించవచ్చని మంత్రి తెలిపారు. 5,920 మంది నిరీక్షణరాష్ట్రంలో సుమారు 5,920 మంది అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వీరిలో దాదాపు 100 మంది గుండె, 3,000 మంది కిడ్నీ, 2,000 మంది లివర్ మార్పిడి కోసం నిరీక్షిస్తున్నారని మంత్రి వివరించారు. పాంక్రియాస్ మార్పిడి కోసం నలుగురు ఉన్నారని తెలిపారు. పుట్టిన నెల రోజుల వయసున్న శిశువుల నుంచి 90 ఏళ్ల వయసున్నవారి వరకు అవయవాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. పదేళ్లలోపు వయసున్న సుమారు 40 మంది పిల్లలు కూడా ఈ జాబితాలో ఉన్నారని వెల్లడించారు.

భారత్
# ప్రతినిధి
తెలుగు దిన పత్రిక

గుంటూరు
గురువారం, 20 ఆగష్టు 2026
వార్తలు

# ఎన్నికలకు ముందస్తుగా క్యాలెండర్ సిద్ధం చేయాలి

## జిఎంసి కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు, 19 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు ముందస్తుగా ఓటర్ల లిస్టు ప్రకటన, ఎన్యూమరేషణ్, వార్డ్ ల రిజర్వేషన్ తదితర అంశాలతో ముందస్తుగా క్యాలెండర్ సిద్దం చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లుపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియకు సదా సిద్దంగా ఉండాలన్నారు. వార్డ్ ల వారీగా ఓటర్ల సర్వే చేయడానికి, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల పర్యవేక్షణ, ఇతర విధులకు అవసరమైన సిబ్బందికి ముందస్తుగానే అవగాహన కల్గించాలన్నారు. ఆర్ఓలు, ఏఆర్ఓలు, బ్యాలెట్ పెట్టెలు, మాస్టర్ ట్రైనర్ల అవసరంపై జిల్లా ఎన్నికల అధికారికి అందించేందుకు రిపోర్ట్ సిద్దం చేయాలని అదనపు కమిషనర్ ని ఆదేశించారు. అదేవిదంగా సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, వాటి బందోబస్తు పై కూడా లిస్టు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కిషోర్, డిప్యూటీ కమిషనర్లు జి.సాంబశివరావు, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఏసిపీ రెహ్మాన్, డిప్యూటీ తహాశీల్దార్లు నాగ మల్లేశ్వరరావు, కిరణ్మై పాల్గొన్నారు.

# జయహో బీసీ నినాదం కాదు.. టీడీపీ విధానం

## ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 19 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** "జయహో బీసీ" అనేది కేవలం నినాదం కాదని, బీసీల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీ విధానంలో అంతర్భాగమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, ఇది బీసీల రాజకీయ సాధికారతకు నూతన దిశా నిర్దేశం చేస్తుందని ఆమె అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నాలుగు దశాబ్దాల క్రితమే బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా ఎదిగే అవకాశం కల్పించారని తెలిపారు. 1987లో స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఎన్టీఆర్ ప్రభుత్వం, అనంతరం 1995లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వాటిని 34 శాతానికి పెంచి బీసీల రాజకీయ సాధికారతకు బలమైన పునాది వేసిందన్నారు. 1994లో పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలకు సవరణలు చేసి గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించి 1995 నుంచే అమలు చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని విమర్శించారు. దీంతో దాదాపు 16,800 మంది బీసీలు స్థానికసంస్థల పదవులకు దూరమయ్యారని అన్నారు. బీసీ నాయకత్వాన్ని అణచివేసి, సంక్షేమ పథకాలకు నిధులు తగ్గించి, బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. రెండు దశాబ్దాలుగా కొనసాగిన బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడటంలో వైఎస్సార్సీపీ పూర్తిగా విఫలమైందన్నారు. బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం చేయాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు రాజకీయ గౌరవం, ఆర్థిక స్థిరత్వం, యువతకు విద్యా-ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు. గత రెండేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా 1.17 కోట్ల మంది బీసీలకు రూ.32,534 కోట్ల ఆర్థిక సహాయం అందించామని పేర్కొన్నారు. వడ్డెర్లకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ దుకాణాలు, నేతన్నలకు ఆర్థిక సాయం, మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.20 వేల ఆర్థిక సహాయం, నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు ఉచిత విద్యుత్, స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. బీసీలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థికంగా, రాజకీయంగా బలమైన వర్గంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమె అన్నారు. బీసీ యువత, మహిళలకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మరిన్ని రాజకీయ అవకాశాలు కల్పించి కొత్త తరం నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 50.42 శాతం ఉన్నప్పటికీ నిర్ణయాధికారంలో వారికి తగిన స్థానం లేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. జనాభాకు తగిన ప్రాతినిధ్యం, ప్రాతినిధ్యానికి తగిన నిర్ణయాధికారం కల్పించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. బీసీలకు చట్టబద్ధంగా మరింత ప్రాతినిధ్యం కల్పించే అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించడం ద్వారా గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కొత్త నాయకత్వం వెలుగులోకి వస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇది కేవలం రిజర్వేషన్ నిర్ణయం మాత్రమే కాదని, బీసీ బిడ్డల సామాజిక గౌరవానికి ప్రభుత్వం ఇచ్చిన భరోసా అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ప్రారంభించిన బీసీ సాధికారత ప్రయాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మరో చారిత్రాత్మక అధ్యాయాన్ని జోడిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. బీసీల అభివృద్ధి అంటే రాష్ట్ర అభివృద్ధి, బీసీల రాజకీయ సాధికారత అంటే ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమేనని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న కూటమి ప్రభుత్వానికి బీసీ సమాజం రుణపడి ఉంటుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలియజేశారు.

# నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలి

## గుంటూరు కలెక్టరేట్ ఎదుట ఏఐవైఎఫ్ ధర్నా




**గుంటూరు, 19 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్, గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్ జీ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది విద్యావంతులైన యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వశాఖల్లో, ప్రభుత్వరంగ సంస్థలలో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వంలో రెండు సంవత్సరాల్లోనే లక్షకు పైన ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారని , కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం 50వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేని స్థితిలో ఉందని అన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం వారి వెన్నుపోటు నైజానికి నిదర్శనం అని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల వయోపరిమితిని పెంచడంతో పాటు నియామక ప్రక్రియల్లో పూర్తి పారదర్శకత పాటించాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, వలి మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 11,639 కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు ప్రతి జిల్లాలో ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు పెంచాలని, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (MSME) రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజు రోజుకూ తీవ్రమవుతున్నప్పటికీ ప్రభుత్వం సమస్య పరిష్కారంపై స్పష్టమైన కార్యాచరణ చేపట్టకపోవడం వల్ల ఉన్నత చదువులు చదువుకున్న యువత తీవ్ర ఆందోళనతో గిగ్ వర్కర్స్ గా మారి సరైన ఉద్యోగ భద్రతా, భరోసా లేకుండా బయన్దోళనలు మధ్య బతుకు బండి ఈడ్చేపరిస్థితి నెలకొన్నదని అన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, ఖాళీలను గుర్తించి దశలవారీగా కాకుండా సమగ్రంగా పూర్తి స్థాయిలో భర్తీ ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు 3000 నిరుద్యోగ భృతి ఇవ్వలన డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భవిష్యత్ లో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువత, విద్యార్థులు, యువజనులను సమీకరించి ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో AISF మాజీ రాష్ట్ర నాయకులు నందా కుమారి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివ, యశ్వంత్, AIYF నాయకులు కిరణ్, రెహ్మాన్, మస్తాన్ రావ్, అభిషేక్, AISF నగర కార్యదర్శి బన్నీ, అమర్నాథ్, అజయ్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల అభ్యున్నతే చంద్రబాబు లక్ష్యం

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**తాడేపల్లి, 19 అగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** బీసీల అభ్యున్నతికి ఆది నుంచి టీడీపీ వెన్నుదన్నుగా నిలుస్తుంటూ వస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనతో బీసీలు కోల్పోయిన 16 వేలకు పైగా పదవులు బీసీలకు లభించనున్నాయన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను కలిసి కురుబ సంక్షేమ సంఘ నాయకులు సత్కరించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ, సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి సవిత కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతే లక్ష్యంగా టీడీపీ ఆవిర్భవించిందన్నారు. బీసీలకు వెన్ను దన్నుగా అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడు నిలిచారన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపు టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే లభించాయన్నారు. తొలుత అన్న ఎన్టీఆర్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించి, వారిని రాజ్యాధికారంలో భాగస్వామ్యులు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు బీసీలను అన్నిరంగాల్లో ముందంజలో ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. అన్న ఎన్టీఆర్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే 1995లో సీఎం చంద్రబాబునాయుడు ఆ సంఖ్యను 34 శాతానికి పెంచారన్నారు. 2021 వరకూ ఆ రిజర్వేషన్లు కొనసాగుతూ వచ్చాయన్నారు. జగన్ వచ్చిన తరవాత స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు కోత విధించి, 24 శాతం అమలు చేశారన్నారు. దీనివల్ల బీసీలు 16,800 పదవులకు దూరమయ్యారన్నారు. బీసీలకు పదవులే కాకుండా ఆర్థికంగా లబ్ధి కలిగించే పథకాలను సైతం జగన్ రద్దు చేశారన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో బీసీలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారన్నారు. ఇదేంటని ప్రశ్నించిన బీసీలను, ఆ సామాజిక వర్గ నేతలను తప్పుడు కేసులతో వేధించారన్నారు. మరోసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, బీసీలకు మంచిరోజులు ప్రారంభమయ్యాయన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇది చారిత్రాత్మక నిర్ణయమన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలు కోల్పోయిన పదవులు మరోసారి లభించనున్నాయన్నారు. నిర్ణయాధికారంతోనే బీసీలకు అందలం దక్కుతుం దని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘ నాయకులు తట్టి అర్జునరావు, మర్రి సత్యనారాయణ, దన్నే అశోక్ కుమార్, బక్కా రామకృష్ణ, ఉమామహేశ్వరరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల నిర్వహణకు సిద్ధం : జిల్లా కలెక్టర్

**గుంటూరు, 19 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందస్తు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ జిల్లా కలెక్టర్ లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నాలుగు పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయని చెప్పారు. బ్యాలెట్ పెట్టెల అవసరం కొంత మేర ఉండవచ్చని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఓటరు జాబితా సిద్ధం చేయాలని, పోలింగ్ కేంద్రాల పరిస్థితిపై దృష్టి సారించాలని ఆదేశించారు. మాస్టర్ ట్రైనర్ లను గుర్తించి శిక్షణ అందించాలని, కార్యక్రమాల నిర్వహణ షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ ఎన్నికల నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, వాటి బందోబస్తు పట్ల దృష్టి సారించాలని ఆదేశించారు. స్థానికంగా సమకూర్చుకోవలసిన ఎన్నికలసామగ్రి, రాష్ట్రస్థాయి నుండి రావలసిన సామాగ్రి జాబితాపై స్పష్టమైన అవగాహన ఉండాలని అన్నారు. కోర్టు వ్యవహారాలలో ఉన్న స్థానిక సంస్థలపై పూర్తి నివేదిక సమర్పించాలని చెప్పారు. ఓటరు జాబితాను తాజా పరచడం విషయంలో షెడ్యూల్ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## వట్టిచెరుకూరు చెరువు పనులు తనిఖీ చేసిన కలెక్టర్



**గుంటూరు, 19 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** వట్టిచెరుకూరు ఊర చెరువు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ బుధవారం తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరికీ నీరు భావనతో అమలు చేస్తున్న 'ప్రధాన మంత్రి కృషి సంచయి యోజన' కింద పనులను రూ.50 లక్షలతో మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఊర చెరువును ఆహ్లాదంగా, సుందరంగా తయారు చేయడం జరుగుతుందని, చిన్నారులు ఆడుకునే విధంగా పరికరాలు ఏర్పాటు, పెద్దలు కూర్చొని సంతోషంగా గడుపుటకు బల్లలు ఏర్పాటు, గట్టు చుట్టూ మొక్కలు ఏర్పాటు, వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తూ ఒక చక్కటి ఆహ్లాదకరమైన పిక్నిక్ స్పాట్ మాదిరిగా తయారు చేయుట జరుగుతుందని తెలిపారు. ఊర చెరువుతోపాటు చుట్టుప్రక్కల దాదాపు వంద ఎకరాల్లో చిన్న చిన్న చెరువులు ఉన్నాయి. ప్రధానంగా ఊర చెరువులో 14 ఎకరాలుగా ఉన్న ఒక భాగాన్ని, 7 ఎకరాలుగా ఉన్న మరో భాగాన్ని తీసుకుని అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఊర చెరువుకు అప్పాపురం ఛానల్ నుండి గ్రావిటీ ద్వారా నీరు నిత్యం చెరువులోకి పారటం మరొక ప్రయోజనకర అంశం. చెరువును పరిరక్షించుకుంటున్న విధానాన్ని, పూడికలు తీసి అభివృద్ధి చేసుకుంటున్న వివరాలను గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ చెరువును చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలని ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తగిన విధంగా గ్రామస్తులు చర్యలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పన, ఇళ్లు లేనివారికి పట్టాలు పంపిణీ వంటి అంశాలపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి శంకర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చెన్నారెడ్డి నవల 'వివేక మందిరం' ఆవిష్కరణ



**గుంటూరు, 19 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఛాంబర్లో ఆంగ్ల విభాగ ఆచార్యులు గుజ్జు చెన్నారెడ్డి రచించిన నవల 'వివేక మం దిరం'ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సం దర్భంగా వీసీ గంగాధరరావు మాట్లాడుతూ, చెన్నారెడ్డి రచనలపై నాగార్జున విశ్వవిద్యాలయ పీహెచ్డీ పరిశోధకులు పరిశోధనలు చేయడం గర్వకారణమన్నారు. విశ్వవిద్యాల యంలోని వివిధ సంఘటనలు, విద్యార్థి జీవితాన్ని ప్రతిబిం బించే అంశాలతో ఆయన రచనలు సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివరాం ప్రసాద్, సింహాచలం, వరప్రసాద్ మూర్తి, రవికుమార్, రామచంద్రన్, పరిశోధకులు పాల్గొన్నారు.

## ఏకలవ్య విగ్రహం ధ్వంసంపై ఆందోళన

**కొత్తవలస, 19 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విజ



యనగరం జిల్లా కొత్తవలస మండలంలోని ఏకలవ్య విగ్రహం ధ్వంసం ఘటన పై ఏకలవ్య సంఘ ఉత్తరాంధ్ర ఉపాధ్యక్షులు పాలవలస పైడితల్లి ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని చింతల దిమ్మ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఏకలవ్య విగ్రహాన్ని రాత్రి సమయంలో దోషం చేశారు. ఈ సంఘటనపై గురుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షురాలు గేదెల శ్రీనమ్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఈ కార్యక్రమములో గ్రామ పెద్దలు గొర్ల సత్యం, గురయ్యా దాసరి దేవుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఎంపీ భరత్ చేతుల మీదుగా బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



**విశాఖపట్నం/కొత్తవలస, 19 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విశాఖపట్నం ఎంపీ భరత్ చేతుల మీదుగా ఎన్టీఆర్ భవన్ లో ఎస్ కోట నియోజకవర్గం, కొత్తవలస మండలం, కొత్తవలస పంచాయతీ, రాజపాత్రునిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురకు వానపల్లి సరస్వతి రూ. 76,795/-, మహాపాత్రుని తెరిసా రూ. 37,255/- బంగారు శ్రవణ్ రూ.12,9455/- మొత్తం రూ. 2,43,505/- ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు లెంక శ్రీను, పి.వీరా పాత్రుడు, దన్నిన రమేష్, ఎం. లక్ష్మణ్ పాల్గొనడం జరిగింది. లెంక శ్రీను మాట్లాడుతూ మా గ్రామానికి ఎంపీ భరత్ ద్వారా మూడు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఇప్పించినందుకు, ఎంపీ శ్రీభరత కి విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు లెంకశ్రీను ధన్యవాదాలు తెలిపారు.

## డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




**గుంటూరు, 19 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆటో, వ్యాన్, జీప్, కార్, లారీ, బస్, ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆటో అండ్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరింది. విశాఖపట్నంలో ఆగస్టు 20, 21 తేదీల్లో నిర్వహించనున్న యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని గుంటూరు ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మంగ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం గుంటూరు జీజీహెచ్ ఆటో స్టాండ్ వద్ద మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంగ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రైవర్లపై భారీగా పెంచిన జరిమానాలకు సంబంధించిన జీవో నంబర్లు 21, 31లను రద్దు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిల్, పెట్రోల్, సీఎన్‌జీ ధరలపై వ్యాట్, సెస్, జీఎస్టీ భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. స్త్రీశక్తి పథకం కారణంగా ఆదాయం కోల్పోయిన డ్రైవర్లకు నెలకు రూ.10 వేల జీవనభృతి అందించాలని కోరారు. డ్రైవర్ల సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల పరిహారం అందించే చంద్రన్న బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెవీ వెహికల్ డ్రైవర్లకు నెలకు కనీసం రూ.36 వేల వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పోలీస్, ఆర్టీఏ, ఈ-చలానాలను రద్దు చేయాలని కోరారు. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్ ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్‌ను 30 శాతం తగ్గించాలని, అర్హులైన డ్రైవర్లకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 2026లో 6వ సంవత్సరం వాహనమిత్ర సాయం వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. డ్రైవర్ల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని, విశాఖలో జరిగే మహాసభలకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ ఆటో స్టాండ్ అధ్యక్షుడు షేక్ రఫీ, అంబులెన్స్ స్టాండ్ అధ్యక్షుడు లక్ష్మణ, వి.శీను, రమేష్, రాంప్రసాద్, భాస్కరరావు, మస్తాన్, బుడే, దుర్గారావు, ఈసుబు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ హోంగార్డు మృతిపై కేసు నమోదు



అనుమతులు లేని ఆస్పత్రిలో వైద్యం
హోంగార్డ్ కుటుంబ సభ్యులను
మభ్యపెట్టిన వైద్యులు
అప్పటికప్పుడు వేలుకు వేలు పెట్టి అనుమతులు
45 రోజులు గడిచాక వారిపైనే కేసును
పెట్టేందుకు ప్రయత్నం
ఎట్టకేలకు హోంగార్డు భార్య రాణి స్పందన
ఫిర్యాదుతో కదిలిన వైన్యం

**ఇబ్రహీంపట్నం, 19 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఇబ్రహీంపట్నంలో విధులను నిర్వహించిన మాజీ హోం గార్డెన్ నక్క రామకృష్ణ గత నెలలో మృతి చెందాడు. గ్యాస్ నొప్పితో బాధ పడుతూ ఇబ్రహీంపట్నంలోని రాఘవేంద్ర క్లినిక్ లో వైద్యం కోసం చేరాడు. తన కుమారుడితో హుషారుగా వచ్చిన రామకృష్ణ కు ఆస్పత్రిలో వైద్యులు లేకుండా కాంపౌండర్ డాక్టర్ ను ఫోన్ సహాయంతో సంప్రదించి వైద్యం చేయటం వలన మృతి చెందారని భార్య రాణి ఆరోపించింది. గ్యాస్ నొప్పికి సంబంధించి ఆసుపత్రికి చేరితే గుండె నొప్పికి సంబంధించిన ఇంజక్షన్ చేయటం వలన మృతి చెందడం జరిగిందని వైద్యులను బాధిత కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. దీనిపై వైద్యులు తప్పు జరిగిందంటే క్షమాపణ కోరి మన్నించాలని బంధువులను బతిమిలాడిన వైద్యులు 45 రోజుల తర్వాత బాధితులపైనే ఫిర్యాదు చేయటం కోసం పోలీసులను ఆశ్రయిస్తే పలు అనుమానాలకు దారి చేశాయి. చనిపోయిన మాజీ హోంగార్డు భార్య రాణి తమ భర్త చనిపోక ముందు మీ ఆసుపత్రికి వచ్చిన వీడియో ను తమకు ఇవ్వాలని కోరగా వైద్యులు ఎందుకని ప్రశ్నించారు. దానికి హోంగార్డు భార్య మావారు చివరి క్షణంలో తిరిగిన ప్రదేశం ఇదే కాబట్టి ఒక్కసారి చూసుకుంటాను మీరు ఇవ్వకపోయినా పర్వాలేదు చూపించండి అని వైద్యుల వద్ద ప్రాధేయపడింది.. దానికి వైద్యులు తమకు సీసీ కెమెరా సంబంధించి ఏమీ తెలియదని.. మరో రెండు రోజులు ఆగి రండి సీసీ కెమెరా టెక్నీషియన్ పిలిపించి వీడియో అందిస్తానని నమ్మించి బంధువులను అక్కడి నుండి పంపించి వేశారట. ఇలా ప్రతిసారి అడిగినప్పుడల్లా ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారని, ఫోన్ చేసినప్పుడల్లా ఇదిగో.. అదిగో అంటున్నారని ఇలా ప్రవర్తించడం వలన పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని బంధువులు ఆరోపించారు. వీడియో ఫుటేజ్ ఇస్తానని 45 రోజులు గడిచిన తర్వాత మా పైనే పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్ వెళ్లి సంబంధిత అధికారిని అడగగా ఆస్పత్రి బాగోతం బయటకు వచ్చింది.. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ సీఐ సుబ్రహ్మణ్యం స్పందించి బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. రోజులు గడుస్తున్న తమకు న్యాయం జరగటం లేదని భావించిన బాధితులు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంబంధిత పోలీస్ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఇబ్రహీంపట్నం పోలీసులకు సూచించారు. అసలు ఆసుపత్రికి అనుమతులు లేవని, అనుమతులు లేకుండా వైద్యం ఎలా చేశారు . నా భర్తను చంపేసి అనుమతులు లేని ఆసుపత్రికి హనుమతులు ఎలా తెచ్చుకున్నాడు.. ఇన్నాళ్లు అనుమతులు లేకుండా ఆసుపత్రి ఎలా నడిపాడు అంటూ బాధ్యతరాలు ఆవేదన వెల్లబుచ్చారు. మేము ఆసుపత్రికి వెళ్లి అడిగిన ప్రతిసారి ఆయన మా పై దాడి చేసేందుకు అనేక మందిని




పోగుచేసుకొని సిద్ధంగా ఉంటున్నారని తెలిపారు. మేము అడిగిన వెంటనే మాకు గనక వీడియో ఇచ్చినట్లయితే ఇంత దూరం వెళ్లే వాళ్ళము కాదని, ఇచ్చిన మరణ ధ్రువీకరణ పత్రంలో కూడా వైద్యుడు నిర్లక్ష్యం వహించినట్లు ఆయనే ఒప్పుకున్నాడని, చనిపోయిన వ్యక్తికి వైద్యం అందించి డబ్బులు గుంజుకున్నాడని ఇలాంటి వైద్యులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు ఆసుపత్రి వైద్యుల పైన అనుమానాస్పద కేసు కింద నమోదు చేశారు.

# వైద్య సమ్మెతో నిలిచిన ఊపిరి..

సర్కారు దవాఖానాల్లో రోగుల ఆర్తనాదాలు !
10వ రోజుకు AP JUDA నిరసన..
గుంటూరు జీజీహెచ్‌లో స్తంభించిన
క్యాజువాల్టీ, ఐసీయూ సేవలు
అప్పులపాలై ప్రైవేట్ దారి పడుతున్న
నిరుపేదలు
తక్షణమే ఎస్మా (ESMA) ప్రయోగించాలని
బాధితుల డిమాండ్

**గుంటూరు, 19 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** తమ స్టైఫండ్ పెంపు కోసమంటూ ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (AP JUDA) చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె నేటికి 10వ రోజుకు, మూడో దశ 3వ రోజుకు చేరింది. హక్కుల సాధన పేరుతో అత్యవసర సేవలను సైతం బహిష్కరించడంతో గుంటూరు సర్వజనాస్పత్రి (GGH)తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యం పైనే ఆధారపడ్డ పేద ప్రజల ప్రాణాలు గాల్లో దీపంలా మారాయి.

**కుప్పకూలిన క్రిటికల్ కేర్.. నిలిచిన అత్యవసర సర్జరీలు**
గుంటూరు జీజీహెచ్ క్యాజువాల్టీ, ఐసీయూ, ట్రూమా కేర్ విభాగాల నుంచి పీజీ, జూనియర్ వైద్యులు పూర్తిగా వైదొలగడంతో అత్యవసర వైద్య వ్యవస్థ అస్తవ్యస్తమైంది.



**గోల్డెన్ అవర్ గల్లంతు :** ప్రమాదాల బారిన పడినవారు, గుండె పోటు, పక్షవాతంతో వచ్చే రోగులకు మొదటి గంటలో అందాల్సిన తక్షణ వైద్యం అందడం లేదు.

**ఆగిన ఎమర్జెన్సీ ఆపరేషన్లు :** ఎమర్జెన్సీ థియేటర్లు మూతపడటంతో నిమిషాల వ్యవధిలో ప్రాణాలు కాపాడాల్సిన సర్జరీలు నిలిచిపోయాయి.

**తీవ్ర ఇబ్బందుల్లో గర్భిణులు, కిడ్నీ బాధితులు:** డయాలసిస్ సేవలు, గర్భిణుల అత్యవసర ప్రసవాలు, క్యాన్సర్ కీమోథెరపీ అందక నిరుపేద రోగులు ఆసుపత్రి వరండాల్లోనే రోదిస్తున్నారు.

**ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ.. అప్పుల ఊబిలోకి పేద కుటుంబాలు**
ఉచిత వైద్యం కోసం పల్లెల నుంచి వ్యయప్రయాసలకోర్చి వచ్చే పేద ప్రజలను వార్డుల్లో చేర్చుకోకపోవడంతో చేసేదేమీ లేక రోగుల బంధువులు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, ఇళ్లు, ఒంటిపై ఉన్న బం



గారాన్ని తాకట్టు పెట్టి ప్రైవేట్ ఆసుపత్రుల బిల్లులు కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వ ల్యాబ్‌లు, స్కానింగ్ సేవలు మూతపడటంతో ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లు రోగులను నిలువునా దోచుకుంటున్నాయి.

**రోగుల ప్రాణాలతో చెలగాటం తగదు !**
స్టైఫండ్ పెంపు న్యాయబద్ధమైనదే అయినప్పటికీ, అమాయక రోగుల ప్రాణాలను పణంగా పెట్టి అత్యవసర సేవలను స్తంభింపజేయడం వైద్య వృత్తి నైతికతకే గొడ్డలిపెట్టు. ఆసుపత్రి ప్రాంగణంలో కళ్లకు గంతలు కట్టుకుని, కూరగాయలు అమ్ముతూ చేస్తున్న నిరసనలు రోగుల బాధలను వెక్కిరించడమేనని స్థానికులు, బాధితులు మండిపడుతున్నారు.

?తక్షణమే 'ఎస్మా' (జూహీూ) ప్రయోగించాలి : ?ప్రభుత్వ అలసత్వం, జూడాల మొండి పంతాల నడుమ పేదల ప్రాణాలు గాల్లో కలుస్తుంటే అధికారులు చూస్తూ ఊరుకోవడం క్షమించరాని నేరమని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని అత్యవసర సేవల పరిరక్షణ చట్టం (జూహీూ) ప్రయోగించి, అత్యవసర సేవలను వెంటనే పునరుద్ధరించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

## బీసీ రిజర్వేషన్లు 34% పెంపు చారిత్రాత్మక నిర్ణయం


ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర
అధ్యక్షులు తాటికొండ నరసింహారావు

**గుంటూరు, 19 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆంధ్ర రాష్ట్రంలో జనాభాలో సగానికి పైగా ఉన్నటువంటి బీసీ వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంపు చేయటం చారిత్రాత్మక నిర్ణయం అని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు హర్షం వ్యక్తం చేశారు. గత వైకాపా ప్రభుత్వం 2019లో బీసీ రిజర్వేషన్స్ 24 శాతానికి తగ్గించటం ద్వారా అప్పట్లో 16,800 మంది బీసీలకు అన్యాయం జరిగిందని వాపోయారు 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవో నంబరు 76 తీసుకొచ్చి బీసీలను అన్యాయం చేసిందని అన్నారు. 559, 560 జీవోల ద్వారా బీసీ రిజర్వేషన్లను ఏకపక్షంగా 34 శాతం నుండి 24.15 శాతానికి తగ్గించిన ఘనత గత పాలకులది అని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయ చైతన్యం తెచ్చిన స్ఫూర్తి దాత ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు నాయుడు 1994లో బీసీలకు 34 % రిజర్వేషన్స్ అమలు చేశారన్నారు. వైకాపా ప్రభుత్వ నిర్ణయాలతో కోల్పోయిన 16800 మంది పదవులు తిరిగి పొందేందుకు బీసీలకు గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 34%, పట్టణ స్థానిక ఎన్నికల్లో 33.33% రిజర్వేషన్స్ కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాసనసభ్యుల మధ్య శాసనసభలో ప్రకటించడం స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేస్తుంన్నామని తాటికొండ



నరసింహారావు తెలిపారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో గుంటూరు జిల్లా నాయీబ్రాహ్మణ జేఏసీ అధ్యక్షులు కొండూరు అంకమ్మరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మార్టూరు వీరరాఘవులు, సౌందర్య శాలల సంక్షేమ విభాగం గుంటూరు అర్బన్ కమిటీ అధ్యక్షులు గంగాధర భాస్కర్ రావు కార్యదర్శి ఎన్ రవీంద్రమణి, ఆర్గనైజర్స్ అద్దంకి రవి, కే బత్తేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## మిషన్ శక్తి పథకం కింద ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు



**గుంటూరు, 19 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మిషన్ శక్తి పథకం కింద గుంటూరు, తుళ్లూరు వన్ స్టాప్ సెంటర్లలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈ నెల 22వ తేదీ శనివారం ఇంటర్వ్యూ లు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళాశిశు సంక్షేమ సాధికారత అధికారి పిపిజి ప్రసూన తెలిపారు. వన్‌స్టాప్ సెంటర్ పథకం కింద ఒక కేస్ వర్కర్, రెండు మల్టీ పర్పస్ స్టాఫ్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారని, అభ్యర్థుల ఇంటర్వ్యూలు ఈ నెల 22 న ఉదయం 10.30 గంటలకు మహిళా ప్రాంగ ణంలోని వన్ స్టాప్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**కొత్తవలస, 19 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కొత్తవలస విజయనగరం రోడ్డులో గల వైజాగ్ ఆప్టికల్స్ షాప్ దగ్గర బుధవారం ఆశీధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. వైజాగ్ ఆప్టికల్స్ యాజమాన్యం భాష మరియు ఖాన్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుండి విజయనగరం రోడ్డులో వైజాగ్ ఆప్టికల్స్ షాపు దగ్గర ఉచితంగా కంటి వైద్యం శంకర పౌండేషన్ ఆసుపత్రి ద్వారా ప్రత్యేకంగా డాక్టర్లు తీసుకువచ్చి కంటికి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు జరగపబడును. 29 మంది వైద్యం చేసుకున్నారు. ఆపరేషన్ ఎంపిక చేసిన వారు 10 మంది శుక్లము ఆపరేషన్ కు ఎంపిక ఆయన నిరుపేదలకు డాక్టర్ సలహా మేరకు కాటరాక్ట్ శాస్త్ర చికిత్స అమర్చి ఉచితంగా ఆపరేషన్ చేయబడును కంటి మీద కండ. మెల్ల కన్ను సరి చేయుట మరియు కంటి శుక్లాలు ఉన్న పెద్దలకు పిల్లలకు ఆరోగ్య శ్రీ వైద్య సేవా పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేయప బడును. కంటి శిబిరామునకు వచ్చువారు తప్పనిసరిగా వారి యొక్క ఆరోగ్య శ్రీ




కార్డు ఆధార్ కార్డు ఇతర గుర్తింపు కార్డు మీ ఫోన్ నెంబరు మరియు ఈ శిబిరంలో కంటి ఆపరేషన్ ఎంపిక అయిన వారికి అదే రోజున ఆపరేషన్ కొరకు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బస్సులో తీసుకుని వెళ్ళబడును. మరియు తిరిగి క్యాంప్ స్థలం వద్దకు చేర్చబడును అన్నారు. అనంతరం శంకర్ ఫౌండేషన్ డాక్టర్




మాట్లాడుతూ. ఉచితంగా కంటి వైద్య శిబిరం వైజాగ్ శంకర్ ఫౌండేషన్ వారు సంప్రదించితే మేము వచ్చి చూస్తామని అన్నారు. ముందుగా బీపీ షుగర్ పరీక్షలు చేసి కంటి ఆపరేషన్ ఎంపిక చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో. పాలూరి గాయత్రి. తూర్పాటి దేవి తదితరులు పాల్గొన్నారు.

# సర్వేయర్లపై దాష్టీకం దారుణం

**ప్రజా తిరుగుబాటు తప్పదు**

**వారి సమస్యలు పరిష్కరించాలి**

**కనీస వేతనం, టీఏ,డీఏ, హెల్త్ ఇన్సూరెన్స్ వంటివి కల్పించాలి**

**దివాలాకోరు పాలనలో ఇద్దరు సర్వేయర్ల ఆత్మహత్య బాధాకరం**

**అధైర్యపడొద్దు.. అసెంబ్లీలో నిలదీస్తం**

**మాజీ మంత్రి హరీశ్‌రావు భరోసా**

**తెలంగాణభవన్‌లో సర్వేయర్లతో భేటీ**




**హైదరాబాద్, ఆగస్టు 19 :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లైసెన్స్ సర్వేయర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీటెక్, ఎంటెక్, సివిల్ ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యను అభ్యసించిన యువతను ఉద్దేశించి ఐఏఎస్ అధికారి లోకేశ్‌కుమార్ బాధ్యతారహితంగా మాట్లాడటం దుర్మార్గమని విమర్శించారు. తమ సమస్యలను చెప్పుకొనేందుకు వెళ్లిన సర్వేయర్లపై మంత్రి పొంగులేటి చేతిలో ఉన్న వస్తువులతో కొట్టడానికి ప్రయత్నించడం ప్రభుత్వ అహంకారానికి, అణచివేతకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆరువేల మంది సర్వేయర్లు, వారి కుటుంబాలు ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. లైసెన్స్ సర్వేయర్లతో తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సర్వేయర్ల సమస్యలు తెలుసుకొని వారిపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హకుల సాధన కోసం ధర్నా చేసిన 6,000 మంది లైసెన్స్ సర్వేయర్లను పోలీసులు పశువుల్లా ఈడ్చుకెళ్లి, ఠాణాల్లో నిర్బంధించి అన్నం కూడా పెట్టకుండా హింసించారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులను ఎందుకు కలుస్తున్నారంటూ సర్వేయర్లను ప్రభుత్వం బెదిరించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించనప్పుడే ప్రజలు ప్రతిపక్షం వద్దకు వస్తారని, బాధితులకు అండగా నిలువడమే బీఆర్ఎస్ ధ్యేయమని స్పష్టంచేశారు. సీఎంవో స్పెషల్ సెక్రటరీతో చిన్నారెడ్డి లౌడ్ స్పీకర్‌లో మాట్లాడితే సీఎం ఈగో దెబ్బతిని వారిని వెళ్లగొట్టుమనడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని విమర్శించారు. సీఎం పదవి ప్రజలిచ్చిన భిక్ష అని, అధికారుల జీతాలు ప్రజల పన్నుల నుంచే వస్తున్నాయని గుర్తుచేశారు.

### లంచాలు వసూలు చేయాలనడం దివాలాకోరుతనం

కనీస వేతనం, టీఏ,డీఏలు, హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవడంతో సర్వేయర్లు తమ సొంత డబ్బులతో విధులకు వెళ్లాల్సి వస్తున్నదని హరీశ్ ఆవేదన వ్యక్తంచేశారు. వంద రూపాయల పెట్రోల్ పోయించుకొని, కేవలం రూ.60 పొందుతూ జీవనం సాగించడం సాధ్యం కాక, అప్పులపాలై ఇద్దరు సర్వేయర్లు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. సమస్యలను కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్తే లంచాలు వసూలు చేసుకోవాలని సూచించడం ఈ ప్రభుత్వ దివాలాకోరుతనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్తున్నవన్నీ పచ్చి అబద్ధాలని ఎండగట్టారు. కేసీఆర్ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడిస్తే.. ఈ ప్రభుత్వం నియామక పత్రాలు అందించి తమ ఖాతాలో వేసుకుంటున్నదని విమర్శించారు. ఇప్పుడు 6 వేల మంది లైసెన్స్ సర్వేయర్లను కూడా ఉద్యోగాల ఖాతాలో చూపిస్తూ మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. లైసెన్స్ సర్వేయర్లు ఎవరూ అధైర్యపడి ప్రాణాలు తీసుకోవద్దని, బీఆర్ఎస్ పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో సర్వేయర్ల సమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని, అన్ని జిల్లాల్లో జరిగే ఆందోళనల్లో బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేలు ప్రత్యక్షంగా పాల్గొంటారని తెలిపారు. యువత తిరగబడే పరిస్థితి రాకముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సర్వేయర్లను వెంటనే చర్చలకు పిలిచి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్ఎస్ పిలుపు

### హరీష్ రావు, తలసాని శ్రీనివాస యాదవ్‌ల హౌజ్ అరెస్ట్

**హైదరాబాద్,ఆగస్ట్19:** మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాసయాదవ్‌లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కోకాపేట్‌లోని హరీశ్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ సందర్శనకు హరీశ్ రావు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నగరం నలువైపులా 'టిమ్స్' పేరుతో సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణ పనులకు కేసీఆర్ శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులను పరుగులు పెట్టించారు. అసెంబ్లీ ఎన్నికల సమయానికి అంటే ఏడాది కాలంలోనే అన్ని దవాఖానల నిర్మాణ పనులు 60 శాతానికిపైగా పూర్తయ్యాయి. గత సంవత్సరమే మూడు సూపర్ స్పెషాలిటీ దవాఖానలు అందుబాటులోకి రావాల్సి ఉండగా, ప్రస్తుతం సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే హడావుడిగా ప్రారంభోత్సం చేశారు. ఈ నేపథ్యంలో హరీశ్ రావు హాస్పిటల్ సందర్శనకు వెళ్తుండటంతో పోలీసులు అడ్డుకున్నారు. నత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. హరీశ్‌రావు నివాసం వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది. అలాగే మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సనత్ నగర్‌లో నూతనంగా ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని బీఆర్ఎస్ హై కమాండ్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని తెలిపారు. వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శిం చాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, అడ్డుకునేందుకు తమను హౌస్ అరెస్ట్‌లు, అక్రమ నిర్బంధాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సనత్ నగర్, అమీర్‌పేట డివిజన్‌లకు చెందిన ముఖ్య నాయకులను పోలీసులు ఎందుకు హౌస్ అరెస్ట్ చేశారని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.

# డ్రగ్స్ రాకెట్ ముఠా గుట్టురట్టు

### ముగ్గురు డ్రగ్స్ సరఫరాదారుల అరెస్ట్

**హైదరాబాద్,ఆగస్ట్19 :** హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఎస్వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం

చేసుకున్నామన్నారు. ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారించగా డ్రగ్స్ మూలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం. విచారణలో ఓ నైజీరియన్ నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు అతడు తెలిపాడు. బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశాం. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి భారీగా మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నాం. నిందితురాలిని విచారించగా.. కేరళలో ఉండే తన స్నేహితుడు అనేశ్వర్ ద్వారా డ్రగ్స్ సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించింది. పట్టుబడిన నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు మరింత ముమ్మరంగా కొనసాగుతోంది. మాదకద్రవ్యాల సరఫరాపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, సైబరాబాద్ పోలీసుల వాట్సప్ నెంబర్ 8712663061కు ఫిర్యాదు చేయాలని డీసీపీ సూచించారు.

# సినిమా టిక్కెట్లపై ప్రభుత్వం కీలక ఆదేశాలు

### థియేటర్ స్క్రీన్స ఆధారంగా రేట్లు

### ఐదు షోలకు అనుమతి..ఆదాయంలో కార్మికులకు వాటా

**హైదరాబాద్,ఆగస్ట్19 :** తెలంగాణలో సినిమా టికెట్ రేట్లపై ప్రభుత్వం కీలక జీవో జారీ చేసింది. కొత్తగా స్పెషల్ థియేటర్స్ కేటగిరీని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 7.1 సౌండ్, 2కె/4కె స్క్రీన్లకు స్పెషల్ కేటగిరీ వర్తించనుంది. ప్రతి థియేటర్‌లో 25 శాతం నాన్-ప్రీమియం సీట్లు ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉదయం 8 నుంచి రాత్రి ఒంటిగంట వరకు 5 షోలకు అనుమతి ఇచ్చింది. చిన్న సినిమాలకు ప్రతి రోజు ఒక షో తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. రూ.100 కోట్లు పైబడిన సినిమాలకు ప్రభుత్వం సూపర్ హై బడ్జెట్ హోదా కల్పించింది. తొలి 10 రోజులు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం కల్పించింది. టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత శాతాన్ని కార్మికుల సంక్షేమ నిధికి విరాళంగా ఇవ్వాలని షరతు పెట్టింది. కార్మికుల సంక్షేమ నిధికి రూ.కోటి వరకు విరాళం తప్పనిసరి చేసింది.

# ఫిలిప్పీన్స్‌లో ఎన్నారై అడ్వైజరీ కమిటీ పర్యటన

**మనీలాలో కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ అధికారులతోనూ భేటీ**

**గల్ఫ్ కార్మికుల కోసం మెరుగైన వలస విధానాల కోసం కృషి**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,ఆగస్టు19 :** తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వలస వెళ్లిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన వలస విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందం సభ్యులు బుధవారం ఫిలిప్పిన్స్ దేశ రాజధాని మనీలాలోని ఇండియన్ ఎంబసీని సందర్శించారు. తర్వాత మనీలాలోని కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ ఉన్నతాధికారులతోనూ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ వలస విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫిలిప్పిన్స్ దేశ వలస విధానాన్ని ఆ దేశ ఉన్నత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వలస విధానాన్ని అమలు చేస్తున్న ఫిలిప్పీన్స్ దేశంలో అమలులో ఉన్న విధి విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి ఇదే తరహా మెరుగైన వలస విధానాన్ని గల్ఫ్ కార్మికుల కోసం అమలు చేసేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడించారు. మనీలాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అంబసడర్ హర్ష కుమార్ జైన్, ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్ లతో వలస కార్మికుల విధానాల అంశాలపై కమిటీ సభ్యులు సుధీర్ఘంగా చర్చించారు. గల్ఫ్ కార్మికులను సంక్షేమం కోసం ఫిలిప్పిన్స్ తరహా విధానాలను అమలు చేస్తామన్నరాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఎన్నారై అడ్వైజరి కమిటీ ఫిలిప్పిన్స్ దేశంలో పర్యటిస్తోంది. ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బిఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, శ్రీనివాస్ జునుగురు, లైజన్ ఆఫీసర్ ఆది కార్తీక్, తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

# కేంద్ర ప్రభుత్వానివి కుట్రపూరిత రాజకీయాలు

### ఎస్ఐఆర్ పేరుతో భారీగా ఓట్ల తొలగింపు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపణ

**ఖమ్మం,ఆగస్టు19 :** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఎస్ఐఆర్ అనే పక్రియను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీతో కలిసి భాజపా కుట్రలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు ఎస్ఐఆర్ అనే భూతాన్ని చూపి భారీగా ఓట్ల తొలగింపుకు తెరలేపిందన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పీఏసీ సమావేశంలో ఎఐసిసి కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కో ఇన్చార్జి సచిన్ సావంత్, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ ,పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివసా రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల ఓట్లే లక్ష్యంగా సుమారు 67 నుంచి 68 లక్షల ఓట్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టడమే కాకుండా, మరో 70 లక్షల ఓట్లను గాలిలో పెట్టి ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారు. కుట్రలను తిప్పికొట్టేందుకు రాబోయే 4-5 రోజుల్లో బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

# నాంపల్లి ఫోక్సో కోర్టు సంచలన తీర్పు

### బాలికలను వ్యభిచార రొంపిలోకి దింపడంపై శిక్ష

### ముగ్గురికి 14 ఏళ్ల జైలు...14మందికి పదేళ్ల కారాగారం

**హైదరాబాద్,ఆగస్ట్19 :** నాంపల్లి పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మైనర్లను వ్యభిచార రొంపిలోకి దింపుతున్న ముఠాకు చెందిన 33 మందిని దోషులుగా నిర్ధారించి, శిక్షలను ఖరారు చేసింది. 2015లో సీఐడీ నమోదు చేసిన పోక్సో కేసులో నాంపల్లి పోక్సో కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో మొత్తం తొమ్మిది మంది బాలికలను ముఠా సభ్యులు లక్ష్యంగా చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాలికలను ప్రలోభాలకు గురిచేసి, వ్యభిచారంలోకి దించినట్లు తేలింది. ప్రాసిక్యూషన్ ఆరోపణలను కోర్టు విచారణలో పరిశీలించింది. సుదీర్ఘకాలం కొనసాగిన ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం న్యాయస్థానం దోషులకు శిక్షలు విధించింది. తీర్పులో భాగంగా ఐదుగురు దోషులకు జీవిత ఖైదు విధించగా, మరో ముగ్గురికి 14 ఏళ్ల జైలు శిక్ష, 14 మందికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. మిగిలిన దోషులకు కూడా కేసులో వారి పాత్రను బట్టి న్యాయస్థానం శిక్షలు ఖరారు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా ఈ కేసులో బాధితులైన తొమ్మిది మంది బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడిన ముఠాపై కఠినంగా వ్యవహరించిన నాంపల్లి పోక్సో కోర్టు తీర్పు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

### సంస్కరణలపై సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ,ఆగస్ట్19:** నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్-2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

# అర్హులు ఓటరు జాబితాలో.. అనర్హులు జాబితా బయట

### ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం

**హైదరాబాద్,ఆగస్ట్19 :** అర్హులైన ఓటరు మిగలకూడదు.. అనర్హుడు ఓటరు జాబితాలో చేరకూడదని ఉన్నతాధికారులకు తెలంగాణ ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎన్నిక సంఘం కార్యాలయంలో ఎస్ఐఆర్ సర్-2026పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓలు, ఈఆర్‌ఓలతో సీఈవో సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని వారిని ఆదేశించారు. అనామలీస్, నో-మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. క్లకెయిమ్స్, అభ్యంతరాలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు నోటీసులు జారీ చేసి విచారణలు చేపట్టాలని తెలిపారు. ం÷ూఆఆ జాబితాలోని కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని వారికి వివరించారు ఫారం 6, 6ం, 7, 8పై ÷-లకెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం చేయ్యాలన్నారు. ఓటర్లకు నోటీసుల వివరాలు బీఎల్‌వోలు స్పష్టంగా చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నో- మ్యాపింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వారికి సీఈవో సుదర్శన్ రెడ్డి వివరించారు.

# సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖలో మార్పులు

### 513 మంది సిబ్బంది వివిధ విభాగాలకు బదిలీ

హైదరాబాద్,ఆగస్ట్19 : మారుతున్న సవాళ్లకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ విభాగాలకు చెందిన 513 మంది సిబ్బందిని ఇతర విభాగాలకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. బదిలీ అయిన 513 మందిలో 5 మంది సీఐలు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు ఉన్నారు. వీరితో పాటు 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లకు కొత్త బాధ్యతలు అప్పగించినట్లు డీజీపీ తెలిపారు. ఈ బదిలీల్లో భాగంగా అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించారు. కొత్త బాధ్యతలు చేపట్టే ముందు సిబ్బందిని రెండు నెలల పాటు వివిధ విభాగాల్లో అటాచ్‌మెంట్ ద్వారా పనిచేయించనున్నట్లు డీజీపీ పేర్కొన్నారు. సిబ్బంది విద్యార్హతలు, అనుభవం, సామర్థ్యం ఆధారంగా తుది బాధ్యతలను నిర్ణయించనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

# వందేమాతరంపై బీజేపీ రాజకీయం

**1937 నాటి వందే మాతరమే ఆలపిద్దాం**
**25 ఏళ్ల దాకా లోక్ సభ సీట్లు యథాతథం**
**ప్రస్తుత 543 సీట్లలోనే మహిళా కోటా**
**చైనా ఆక్రమణపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలి**
**రామభక్తులకు ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి**
**మోడీ చేతిలో యువత భవిత నాశనం**
**మతోన్మాదం.. విద్యాసంస్థల్లో ఆర్ఎస్ఎస్ ఆధిపత్యం**
**యువత కోసం నడుం బిగిద్దాం**
**ఛాత్రోన్ గంజ్లో దీనికి రాహుల్ నాంది**
**సీడబ్ల్యూసీ భేటీలో తీర్మానం**



**న్యూఢిల్లీ:** గడచిన 12 సంవత్సరాల్లో మోడీ ప్రభుత్వం యువత భవిష్యత్తును నాశనం చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. దేశంలో అంతకంతకు మతోన్మాదం పెరిగిపోతోందని, విద్యాసంస్థల్లో ఆర్ఎస్ఎస్ వారి ఆధిపత్యం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత భవితవ్యం కోసం నడుం బిగిద్దామని, రోడ్ మ్యాప్ రూపకల్పన చేద్దామని, ఆ క్రమంలో రాహుల్ గాంధీ చేప ట్టిన ఛాత్రోన్ కీ గంజ్ కార్యక్రమం నాంది పలికిందని తెలిపారు. బుధవారమిక్కడ ఇందిరా భవన్లో కాంగ్రెస్ కార్యవర్గ(సీడబ్ల్యూసీ) సమావేశం జరిగింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావే "శంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా. గాంధీ సహా వివిధ సీనియర్ నేతలు, నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. సుమారు 88 మంది హాజరయ్యారు. 33 మంది చర్చలో పాల్గొన్నారు.

## 1937 నాటి వందేమాతరమే ఆలపిస్తాం

తన కార్యక్రమాల్లో వందేమాతరం మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని కాంగ్రెస్ పార్టీనిర్ణయించింది. ఇది 1937లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ 3 "మిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని అనుసరించడ మే అని స్పష్టం చేసింది. ఆ సమావేశంలో మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్ర బోస్ వంటి స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు పాల్గొ న్నారు. అప్పటి నిర్ణయం ప్రకారం జాతీయ సమావేశాల్లో మొదటి రెండు చరణాలను మాత్రమే పాడాలని నిర్ణయించారని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. సమావేశానంతరం మీడియాతో మాట్లాడుతూ. వందేమాతరంపై ఎలాంటి సందేహం లేదని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ఈ విషయంపై స్పష్టంగా చెప్పారని ఆయన తెలిపారు. వందేమాతరం కాంగ్రెస్కు భావోద్వేగ అంశం అయితే వీజేపీకి ఇది రాజ కీయ అంశంగా మారిందని వేణుగోపాల్ వ్యాఖ్యానించారు.

## చైనా ఆక్రమణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి

ఇటీవల చైనా మన సరిహద్దుల్లో చొరబాటు చేసినట్లు తీవ్రమైన వాస్తవాలు బయటపడ్డాయని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ప్రభుత్వం దీనిపై నిజాయతీగా మాట్లాడాల్సి పోయి అలవాటు ప్రకారం ఈ వార్తలను తప్పు అని చెప్పింది అని ఆరోపించారు. జాతీయ భద్రతపై రాజకీయాలు జరగకూడదు కానీ జాతీయ భద్రతను ఏ స్థాయిలోనైనా నిర్లక్ష్యం చేయకూడదు. మన దేశ సరిహద్దుల వాస్తవ పరిస్థితి ఏమిటో తెలుసుకునే హక్కు దేశ పౌరులకు ఉంది. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత ఎవరూ లోపలికి రాలేదు ఎవరూ లోపలికి రాలేదు అని ప్రధానమంత్రి చెప్పిన మాట దేశం విన్నది. అయిన ప్పటికీ ఆరు సంవత్సరాల తర్వాత కూడా సరిహద్దుల కు సంబంధించిన తీవ్రమైన ప్రశ్నలు వినవస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదు. ప్రభుత్వంపై ఇప్పటికైనా దీనిపై సమాధా నం ఇవ్వాలి అని అని బర్గే డిమాండ్ చేశారు.

## రామభక్తులకు మోడీ క్షమాపణ చెప్పాలి

అయోధ్య రామ మందిరంలో జరిగిన భారీ అవకత వకల విషయం ప్రజల్లో చర్చనీయాంశమైంది. రామ మందిర నిర్మాణం కోసం ప్రధానమంత్రి పార్లమెంట్లో ట్రస్ట్ ఏర్పాటు ప్రకటన చేశారు. ఆలోచించి తమ వారిని ట్రస్టో ఉంచి ఉంటారు. ట్రస్ట్ ప్రధానమంత్రి ఏర్పాటు చేశారు కాబట్టి నిజాయతీగా పని జరుగుతుందని అనుక ఎనిసాధారణ ప్రజలు హృదయపూర్వకంగా విరాళాలు, బంగారం, వెండి ఇచ్చారు కానీ అక్కడ భారీ అవకత వకలు బయటపడ్డాయి. ప్రజలు ప్రశ్నలు అడుగుతు న్నారు. కానీ మోడీ నిరంతరం మౌనంగా ఉన్నారు. దేశం తెలుసుకోవాలనుకుంటోంది అక్కడ ఎంత విరా ళం వచ్చింది? ఎంత బంగారం వెండి ఇతర విలువైన వస్తువులు వచ్చాయి? దాని లెక్కజోక్యం ఏమిటి? కేవలం కొందరు చిన్నవారిని జైలుకు పంపడం వల్ల ఈ విషయం ముగియదు. ఈ అంశాన్ని బీజేపీ ఎంత దారి మళ్లించాలనుకున్నా ప్రజల మనసులో సందేహం అంత లోతుగా పెరుగుతుంది కాబట్టి మోడీ ఈ విషయంలో భక్తులైన ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ఈ అంశంపై సమాధానం ఇవ్వాలి అని ఖరే డిమాండ్ చేశారు.


## 543 స్థానాలలోనే మహిళా కోటా

నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది. కాంగ్రెస్ పార్టీ లోక్సభలో ప్రస్తుతం ఉన్న 543 స్థానాల సంఖ్యను మరో 25 సంవత్సరాల పాటు మార్చకుండా ఉంచాలని స్పష్టంగా డిమాండ్ చేసింది. ప్రతి రాష్ట్రానికి కేటాయించిన స్థానాల వాటాను కూడా అలాగే కొనసాగించాలని తెలిపింది. ఈ 543 స్థానాల లోక్సభలోనే మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషనన్ను వెంటనే అమలు చేయాలని సీడబ్ల్యూసీ డిమాండ్ చేసింది. ఇది సెప్టెంబర్, 2023లో ఆమోదం పొంది, ఏప్రిల్ 16, 2026నన నోటిపై చేయబడిన చట్టం ఆధారంగా అమలు కావాలని కోరింది. తమిళనాడు అసెంబ్లీలో నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా ఆమోదించిన తీర్మానానికి పూర్తి మద్దతు తెలిపింది.

# కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

**రైలు, రహదారి మౌలిక సదుపాయాలకు పెద్దపీట**

**రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు ఆమోదం**



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేలా మొత్తం రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో నాలుగు రైల్వే బహుళ మార్గాల ప్రాజెక్టులు కాగా, మరొకటి బిహార్లో రహదారి ప్రాజెక్టు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. ఇవి నాలుగు రాష్ట్రాల్లో రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించినవి. ముఖ్యంగా గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.2,229 కోట్లతో గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖరగ్పూర్-భద్రక్ 4వ లైన్కు రూ.3,352 కోట్లు, భద్రక్-హరిదాస్పూర్ 4వ లైన్కు రూ.1,583 కోట్లు, కటక్-పారాదీప్ 3, 4వ లైన్లకు రూ.2,286 కోట్లు కేటాయించార. రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే సరుకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. మొత్తం మీద సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రైళ్ల రాకపోకలు కూడా మరింత సులభతరం కానున్నాయి. లాగే బిహార్లోని ముజఫర్పూర్-సీతామర్హి-సోన్బర్సా హైవే నిర్మాణానికి కూడా కాబినెట్ నుంచి ఆమోదం లభించింది. నాలుగు లైన్లతో నిర్మించే ఈ హైవేకు రూ.3,591 కోట్లు కేటాయించారు. ఈ రహదారి బిహార్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానాన్ని కల్పించడంతో పాటు నేపాల్ సరిహద్దు వైపు రవాణా సౌకర్యాలను బలోపేతం చేయనుంది.

# ఇరాన్ క్షిపణి దాడులపై అరబ్ ఆగ్రహం

**ఇరాన్తో వాణిజ్య బంధాన్ని తెంచుకుంటున్నట్లు ప్రకటన**

**న్యూఢిల్లీ:** ఇరాన్తో అన్ని వాణిజ్య, ఆర్థిక లావాదేవీలను నిలిపివేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో యూఏఈ ఈ చర్య తీసుకుంది. ప్రాంతీయ ఉద్రిక్తతల దృష్ట్యా... ఇరాన్తో అన్ని వాణిజ్య, వ్యాపార వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలను తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు నిలిపివేశామని యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అఫ్రా అల్ హమెలీ తెలిపారు. మరో క్షిపణి ముప్పు గురించి దేశ ప్రజల్ని హెచ్చరిస్తూ ఫోన్ అలర్ట్ జారీ చేసిన దాదాపు రెండు గంటల తర్వాత యూఏఈ ఈ ప్రకటన చేసింది. 'ప్రస్తుత పరిస్థితి, క్షిపణి ముప్పు కారణంగా, వెంటనే ప్రజలు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని యూఏఈ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ సదరు ఫోన్ అలర్ట్లో పేర్కొంది. అయితే, ఆ అలర్ట్ను కొద్దిసేపటికే ఉపసంహరించారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి, ఇరాన్ దాడుల తీవ్రతను యూఏఈ ఎక్కువగా ఎదుర్కొంది. ఈ ప్రాంతంలోని మరే ఇతర దేశం కంటే ఎక్కువగా, దాదాపు 3,000 క్షిపణులు, డ్రోన్లు ఆ దేశంపై ఇరాన్ ప్రయోగించింది. గల్ఫ్లోని నౌకా రవాణాపై ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆరోపించగా, ఈ ఆరోపణను ఇరాన్ ఖండించింది. ఇరాన్ తమ దేశం వైపు క్షిపణిని ప్రయోగించిందన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వాదనను ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయి ఖండించారు. ఈ వాదన ప్రాంతీయ విశ్వాసానికి, భద్రతా ప్రయత్నాలకు హానికరమని ఆయన పేర్కొన్నారు.

# కశ్మీర్లోకి 10వేల మంది ఉగ్రవాదుల తరలింపు

**నసీర్ మాద్నీ సంచలన వ్యాఖ్యలు**

**లాహోర్:** పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓ మతబోధకుడు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పంజాబ్ ప్రావిన్స్లోని బహావల్నగర్లో ఆగస్టు 14న జరిగిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన నసీర్ మాద్నీ కశ్మీర్ గురించి పలు సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఉగ్రసంస్థ ఎల్ఈటీ చీఫ్ హాఫీజ్ సయీద్ కశ్మీర్లోకి 10 వేల మంది ఉగ్రవాదులను పంపించినట్లు చెప్పాడు. దీంతో, కశ్మీర్లో ఉగ్ర నెట్వర్క్ వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం అవుతోంది. హాఫీజ్ సయీద్ సారథ్యంలోని లష్కరే తొయిబా భారత్లో అనేక దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి హాఫీజ్పై పలు కేసులు నమోదయ్యాయి. 26/11 దాడుల్లో మంది పాక్ ఉగ్రవాదులు సముద్రమార్గంలో ముంబైలోకి ప్రవేశించి నాలుగు రోజుల పాటు మారణ హోమం సృష్టించారు. ఈ ఉగ్రవాద దాడిలో 166 మంది మరణించగా 300 మంది గాయపడ్డారు. ఇక గతేడాది పహల్గాం దాడిలో 26 మంది సాధారణ పౌరులు కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి జమ్మూలోని కోర్టు హాఫీజ్పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఐక్యరాజ్య సమితి, అమెరికా కూడా ఎల్ఈటీని ఉగ్రవాద సంస్థగా ప్రకటించాయి.

# పుణె జిల్లాలో దారుణ ఘటన

**బాలికపై అత్యాచార యత్నం...హత్య**

**యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**పుణె:** మహారాష్ట్రలోని పుణె జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. 9 ఏళ్ల బాలికపై పొరిగింటి వ్యక్తి అత్యాచారం చేసి హత్యకు పాల్పడ్డాడు. ఆ పొరుగింటి 25 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని, కేసును త్వరితగతిన విచారించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు పుణె-నాసిక్ జాతీయ రహదారిని దిగ్బంధించారు పుణె జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన బాధిత బాలిక నాలుగో తరగతి చదువుతోంది. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. మంగళవారం అనారోగ్యంగా ఉండటంతో బాలిక పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయింది. మధ్యాహ్న సమయంలో తల్లిదండ్రులు ఇంట్లో లేని విషయాన్ని తెలుసుకున్న నిందితుడు బాలికను లైంగికంగా వేధించాడు. అనంతరం గొంతు నులిమి హత్య చేశాడు బాలిక ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కలిసి పరిసర ప్రాంతాల్లో గాలించారు. గంటల పాటు వెతికినా ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆ బాలిక కోసం కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి నిందితుడు కూడా వెతికాడు. దర్యాప్తులో భాగంగా పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా సైకిల్పై వెళ్తున్న వ్యక్తి కనిపించాడు. వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అతడు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు ఓ వాగు సమీపంలోని చెట్టు కింద బాలిక మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఘటనాస్థలాన్ని ఫోరెన్సిక్ బృందం పరిశీలించి కీలక ఆధారాలను సేకరించింది. నిందితుడికి మరణశిక్ష విధించాలని, కేసును త్వరితగతిన విచారించాలని బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు.

# భారత్లో జమ్మూకశ్మీర్ ముఖ్యమైన భాగం..

**ఒమర్ అబ్దుల్లాతో అమెరికా రాయబారి భేటీ..**

జమ్మూకశ్మీర్ అంశంపై అమెరికా నుంచి కీలక వ్యాఖ్య వెలువడింది. అమెరికా రాయబారి సెర్గియో గోర్ బుధవారం శ్రీనగర్లో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో సమావేశమయ్యారు. అనంతరం 'జమ్మూకశ్మీర్ భారత్లో ఒక ముఖ్యమైన భాగం' అని వ్యాఖ్యానించారు. అమెరికా రాయబారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సెర్గియో గోర్ జమ్మూ కశ్మీర్లో పర్యటించడం ఇదే తొలిసారి ఆర్టికల్ 370 రద్దు తర్వాత అమెరికా రాయబారి శ్రీనగర్కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా జమ్మూకశ్మీర్ను భారత్లోని ముఖ్యమైన భాగంగా అమెరికా రాయబారి బహిరంగంగా పేర్కొనడం ప్రాధాన్యం కలిగిన పరిణామం అని చెప్పాలి. జమ్మూకశ్మీర్పై పాకిస్థాన్ తన వాదనను కొనసాగిస్తున్న సమయంలో భారత్ వైఖరికి అనుకూలంగా అమెరికా రాయబారి మాట్లాడడం అత్యంత కీలకంగా నిలవనుంది. కాగా, రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన జమ్మూకశ్మీర్తో పాటు లద్దాఖ్లోనూ పర్యటించనున్నారు. శ్రీనగర్లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కలిశారు. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్, అమెరికా మధ్య సంబంధాలను మరింత విస్తరించే అవకాశాలపై చర్చ జరిగినట్లు ఒమర్ అబ్దుల్లా తెలిపారు. అంతకుముందు ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్కు సంబంధించిన అంతర్గత సమస్యలను అమెరికా రాయబారి వద్ద ప్రస్తావించబోనని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్ సమస్యలను పరిష్కరించాల్సింది న్యూఢిల్లీ అని, వాషింగ్టన్ కాదని ఆయన పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్కు సంబంధించిన అమెరికా ప్రయాణ హెచ్చరికను కూడా సమీక్షించే అవకాశం ఉందని సెర్గియో గోర్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికా తన పౌరులకు జమ్మూకశ్మీర్లో ఉగ్రవాదం, పౌర అశాంతి వంటి కారణాలతో ప్రయాణంపై హెచ్చరికలు జారీ చేస్తోంది.

# టేబుల్పై డిఎంకె అవినీతి ఫైల్స్

**వాటిని అప్పడే తెరిచేలా చేయకండి**

**తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ సంచలన వ్యాఖ్యలు**

**చెన్నై:** ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్పైనే ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు ఆ ఫైల్స్ తెరుస్తానని స్పష్టం చేశారు. తనను బలవంతం చేసి.. వాటిని ఇప్పుడే తెరిచేలా చేయొద్దని డీఎంకే నేతలకు వార్నింగ్ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై బుధవారం తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి విజయ్ డీఎంకే పార్టీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు ఎప్పుడు.. ఏం చెప్పాలో నాకు తెలుసు. అందుకే ప్రజలు మాపై నమ్మకంతో ఈ స్థానంలో కూర్చోబెట్టారు. ఉప ఎన్నికల సమయంలో నేను మాట్లాడతాను. ప్రజలకు కొంత మంచి జరగనివ్వండి' అని అన్నారు.

# కోల్కతా హోటల్లో అగ్నిప్రమాదం

**అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో 9మంది మృత్యువాత**

**మృతులంతా చికిత్స కోసం వచ్చిన బంగ్లాదేశీయులుగా గుర్తింపు**



**కోల్కతా:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్కతాలోని మిర్జా గాలిబ్ వీధిలో ఉన్న ఓ హోటల్లో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఆ దుర్ఘటనలో 9 మంది చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. రాత్రి 1.45 నిమిషాలకు ప్రమాదం చోటుచేసుకున్నది. అగ్నిమాపక సిబ్బంది తో పాటు పోలీసులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గాయపడ్డవారిని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. దట్టమైన పొగ కమ్ముకోవడం వల్ల పై అంతస్తులకు చేరుకోవడానికి అగ్నిమాపక సిబ్బంది ఇబ్బందిపడింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అగ్నిప్రమాదంలో ఓ చిన్నారి సహా 9 మంది మృతి చెందారు. న్యూమార్కెట్ ప్రాంతంలోని ఫ్రీ స్కూల్ వీధిలో అర్ధరాత్రి 2 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పలువురు చిక్కుకుపోయి మరణించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారందరూ బంగ్లాదేశీయులేనని అగ్నిమాపక శాఖ తెలిపింది. మెడికల్ ట్రీట్మెంట్ కోసం వారు కోల్కతాకు వచ్చారని అధికారులు తెలిపారు. ఏసీ పేలడంతో మూడో అంతస్తులో మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఘటనకు గల కారణం ఇంకా వెల్లడించలేదు. మంటలు చెలరేగగానే హోటల్లోని కొందరు బయటకు పరుగుతీశారు. అగ్నికీలలు చుట్టూ ఉన్న ఇళ్లవైపు వ్యాపించడంతో ప్రజలు హాహాకారాలు చేశారు. ఘటన గురించి తెలియగానే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నాలుగు ఫైర్ ఇంజన్ల సాయంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చారు. దట్టమైన పొగ వ్యాపించడంతో సహాయ కార్యక్రమాలకు కాస్త అంతరాయం ఏర్పడిందని ఓ పోలీసు అధికారి తెలిపారు. కాగా రెండు రోజుల క్రితం బిర్భూమ్ జిల్లాలోని ఓ హోటల్ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 8 మంది మరణించగా పలువురు గాయపడ్డారు.

# గాలే టెస్టులో భారత్ ఘన విజయం

**సుతార్ స్పిన్ మాయకు లంక చిత్తు!**

**గాలే టెస్టులో శ్రీలంకపై 165 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం**

**రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు పడగొట్టి సత్తా చాటిన యువ స్పిన్నర్ మానవ్ సుతార్**

**మొదటి ఇన్నింగ్స్‌లో దేవదత్ పడిక్కల్ సెంచరీతో భారత్‌కు భారీ ఆధిక్యం**

**ఈ గెలుపుతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన టీమిండియా**

**ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో 12 కీలక పాయింట్లు ఖాతాలో వేసుకున్న భారత్**






శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు 165 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ (6/55) అద్భుతమైన బౌలింగ్‌తో చెలరేగడంతో టీమిండియా మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన భారత్, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఖాతాలో 12 కీలక పాయింట్లను జమ చేసుకుంది. భారత జట్టుకు ఇది 600వ టెస్టు మ్యాచ్ కావడం, గాలే స్టేడియానికి 50వ టెస్టు కావడం ఈ విజయానికి మరింత ప్రత్యేకతను చేకూర్చింది.

ఐదో రోజు ఆటలో భాగంగా రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన శ్రీలంక 77.4 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌట్ అయింది. లంచ్ విరామం తర్వాత శ్రీలంక బ్యాటర్లు సోనాల్ దినుష, కేశర నువంత కొద్దిసేపు భారత బౌలర్లను నిలువరించారు. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో రాణించిన దినుష (84) మరోసారి అద్భుతంగా ఆడి, రెండో సెంచరీ దిశగా సాగుతున్నట్లు కనిపించాడు. ఈ దశలో మ్యాచ్ డ్రాగా ముగుస్తుందేమోననిపించింది.

అయితే, యువ కెరటం మానవ్ సుతార్ తన స్పిన్ మాయాజాలంతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. 76వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన సుతార్, ఒకే ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టి శ్రీలంక పతనాన్ని శాసించాడు. ఆ ఓవర్లో దినుషను లెగ్ గల్లీలో ధ్రువ్ జురెల్ క్యాచ్ ద్వారా ఔట్ చేసి కీలక భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాతి బంతికే ప్రభాత్ జయసూర్యను క్లీన్ బౌల్డ్ చేశాడు. హ్యాట్రిక్ బంతిని లహిరు కుమార ఎదుర్కొన్నప్పటికీ, రెండు బంతుల తర్వాత అతనిని కూడా కీపర్ రిషభ్ పంత్ క్యాచ్ ద్వారా పెవిలియన్‌కు పంపాడు. దీంతో తన రెండో టెస్టులోనే రెండోసారి ఐదు వికెట్ల ఘనతను సుతార్ అందుకున్నాడు. ఆ తర్వాత కొద్దిసేపు నువంత (20) పోరాడినా.. 78వ ఓవర్లో అతడిని కూడా బౌల్డ్ చేసిన సుతార్, భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. దీంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ మ్యాచ్‌లో సుతార్ మొత్తం 101 పరుగులిచ్చి 10 వికెట్లు పడగొట్టాడు. భారత్ విజయానికి తొలి ఇన్నింగ్స్‌లో దేవదత్ పడిక్కల్ సాధించిన అద్భుతమైన సెంచరీ (167) బలమైన పునాది వేసింది. అతని ఇన్నింగ్స్ వల్లే భారత్‌కు 178 పరుగుల కీలక ఆధిక్యం లభించింది. ఇక, రెండో ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్ ఆడిన వ్యూహాత్మక ఇన్నింగ్స్ (66) కూడా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ స్కోరుతో భారత్ బౌలర్లు టర్నింగ్ పిచ్‌పై లంక బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టి విజయాన్ని ఖాయం చేశారు.

**సంక్షిప్త స్కోర్లు:**

భారత్: తొలి ఇన్నింగ్స్ - 462, రెండో ఇన్నింగ్స్ - 193

శ్రీలంక: తొలి ఇన్నింగ్స్ - 284, రెండో ఇన్నింగ్స్ - 206

## రవీంద్ర జడేజా సరికొత్త చరిత్ర..

శ్రీలంకతో గాలే అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన జడేజా, టెస్టుల్లో 350 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. ప్రస్తుతం ఐసీసీ పురుషుల టెస్ట్ ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న జడేజా, మూడో రోజు ఆటలో లంక బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టి ఈ అరుదైన ఫీట్‌ను అందుకున్నాడు. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు సోమవారం ఉదయం సెషన్‌లో శ్రీలంక టెస్ట్ కెప్టెన్ ధనంజయ డి సిల్వాను ఔట్ చేయడం ద్వారా జడేజా తన వికెట్ల ఖాతాను తెరిచాడు. అనంతరం మూడో సెషన్‌లో కేశర నువాంత వికెట్‌ను పడగొట్టి తన టెస్ట్ కెరీర్‌లో 350 వికెట్ల మైలురాయిని లాంఛనంగా అధిగమించాడు. 2012లో టీమిండియా తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేసిన జడేజా, గాలేలో తన 90వ టెస్ట్ మ్యాచ్ ఆడుతూ ఈ ఘనత సాధించడం విశేషం. టెస్ట్ క్రికెట్ చరిత్రలో భారత్ తరఫున 350 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టిన ఐదో బౌలర్‌గా జడేజా రికార్డు సృష్టించాడు. ఈ జాబితాలో దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే 619 వికెట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు (1990-2008 మధ్య 132 టెస్టులు). కుంబ్లే తర్వాతి స్థానాల్లో రవిచంద్రన్ అశ్విన్ (537 వికెట్లు), కపిల్ దేవ్ (434 వికెట్లు), హర్భజన్ సింగ్ (417 వికెట్లు) ఉన్నారు. ఇప్పుడు వారి సరసన జడేజా సగర్వంగా నిలిచాడు. కేవలం బౌలింగ్‌లోనే కాకుండా, ఆల్ రౌండర్‌గానూ జడేజా ప్రపంచ స్థాయి రికార్డును నెలకొల్పాడు. టెస్టుల్లో 4,000 కంటే ఎక్కువ పరుగులు చేసి, 350కి పైగా వికెట్లు తీసిన ప్రపంచంలోనే నాలుగో క్రికెటర్‌గా, భారత్ తరఫున దిగ్గజం కపిల్ దేవ్ తర్వాత రెండో ఆటగాడిగా నిలిచాడు. ప్రపంచ క్రికెట్ చరిత్రలో ఈ ఘనత సాధించిన దిగ్గజాల జాబితాలో.. కపిల్ దేవ్ ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. అతడు 131 టెస్టుల్లో 5,248 పరుగులు, 434 వికెట్లు సాధించాడు. ఇయాన్ బోథమ్ (ఇంగ్లాండ్).. 102 టెస్టుల్లో 5,200 పరుగులు, 383 వికెట్లు.. డేనియల్ వెట్టోరి (న్యూజిలాండ్).. 113 టెస్టుల్లో 4,531 పరుగులు, 362 వికెట్లు.. రవీంద్ర జడేజా




(భారత్).. 90 టెస్టుల్లో 4,108 పరుగులు.. 350ం వికెట్లు జూన్ 2026లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు ఎంపిక కాని జడేజా, లంకతో సిరీస్‌లో తిరిగి జట్టులోకి వచ్చి సత్తా చాటాడు. ఇప్పటివరకు 134 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో 4,108 పరుగులు పూర్తి చేసిన జడేజా, ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 13 పరుగులు చేశాడు. తాజా ప్రదర్శనతో టెస్ట్ క్రికెట్‌లో అత్యుత్తమ ఆల్ రౌండర్లలో ఒకడిగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు.

## నాల్గో రోజు ఆటలో తీవ్ర నాటకీయ పరిణామాలు

గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ నాల్గో రోజు ఆటలో తీవ్ర నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకను భారత బౌలర్లు ముప్పుతిప్పలు పెడుతున్న సమయంలో రవీంద్ర జడేజా వేసిన ఒక నోబాల్ టీమ్ ఇండియాను నిరాశపరిచింది. జడేజా వేసిన బంతి షార్ప్‌గా టర్న్ అవుతూ లంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా బ్యాట్ ఎడ్జ్ తీసుకుని ఫస్ట్ స్లిప్‌లో సులభమైన క్యాచ్‌గా వెళ్లింది. అయితే ప్లేయర్లు సంబరాలు చేసుకునే లోపే అంపైర్ నోబాల్ సిగ్నల్ ఇచ్చాడు. జడేజా క్రీజు దాటి అడుగు వేయడంతో దక్కాల్సిన కీలక వికెట్ చేజారింది. దీంతో డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ముఖంలో తీవ్ర అసహనం స్పష్టంగా కనిపించింది. తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగుల ఆధిక్యం సాధించిన ఇండియా, నాల్గో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. తొలి ఓవర్‌లోనే యశస్వి జైస్వాల్ డకౌట్‌గా వెనుదిరిగాడు. కేఎల్ రాహుల్ (35), దేవదత్ పడిక్కల్ (44) రెండో




వికెట్‌కు 65 పరుగులు జోడించారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన డాషింగ్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 69 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 66 రన్స్ బాదాడు. ఈ క్రమంలో టెస్ట్ క్రికెట్‌లో 100 సిక్సర్లు కొట్టిన తొలి భారతీయ బ్యాటర్‌గా పంత్ అరుదైన చరిత్ర సృష్టించాడు. జడేజాతో కలిసి 54 పరుగులు జోడించిన పంత్ అవుటైన తర్వాత మిగతా బ్యాటర్లు విఫలమవడంతో ఇండియా 193 పరుగులకే ఆలౌట్ అయింది.

## టీమిండియా మైండ్ గేమ్ అదుర్స్!

శ్రీలంకతో గాలే వేదికగా జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్ ఐదో రోజు ఆటలో టీమ్ ఇండియా యంగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ తన మైండ్ గేమ్‌తో లంక వికెట్ కీపర్ బ్యాటర్ నిరోషన్ డిక్వెల్లాను బోల్తా కొట్టించాడు. బ్యాటింగ్ చేస్తున్న డిక్వెల్లాను క్లోజ్ ఫీల్డింగ్ లో ఉన్న జైస్వాల్ మాటలతో రెచ్చగొట్టి పెద్ద షాట్ ఆడేలా టెంప్ట్ చేశాడు. జైస్వాల్ వేసిన ఈ మైండ్ ట్రాప్ లో పడిన డిక్వెల్లా ఆ మరుసటి బంతికే భారీ షాట్ ఆడబోయి వికెట్ పారేసుకున్నాడు.డిక్వెల్లా క్రీజులో ఉన్నప్పుడు జైస్వాల్ దగ్గరగా వచ్చి మాటల యుద్ధం స్టార్ట్ చేశాడు. “కమాన్ యార్, ఫస్ట్ ఇన్నింగ్స్ లో ఎన్నో షాట్లు ఆడావు కదా, ఇప్పుడు ఏదైనా చూపించు. డీప్ స్క్వేర్ లెగ్ వైపు సిక్స్ కొట్టు” అని జైస్వాల్ రెచ్చగొట్టాడు. దీనికి డిక్వెల్లా రియాక్ట్ అవుతూ, “ఇప్పుడు అవసరం లేదు, నన్ను ఐపీఎల్ కు తీసుకెళ్లు, అప్పుడు సిక్స్ కొట్టి చూపిస్తా” అని బదులిచ్చాడు. వెంటనే జైస్వాల్ స్పందిస్తూ “తప్పకుండా తీసుకెళ్తాం, నువ్వు ఒక్క సిక్సర్ కొట్టు, నిన్ను ఐపీఎల్ కు తీసుకెళ్లే బాధ్యత నాది” అని ఊరించాడు. ఈ మాటలతో ఏకాగ్రత కోల్పోయిన డిక్వెల్లా భారీ షాట్ కొట్టాలనే తొందరపాటులో పడ్డాడు. పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ వరుసగా సంధించిన షార్ట్ పిచ్ బౌన్సర్లలో ఒకదానిని ఆడే క్రమంలో బంతి ఎడ్జ్ తీసుకుని వికెట్ కీపర్ చేతికి చిక్కింది. దాంతో



లంక కీలక వికెట్ కోల్పోయింది. జైస్వాల్ తెలివిగా ఆడిన మైండ్ గేమ్ ఇండియాకు ఒక క్రూషియల్ బ్రేక్ త్రూ అందించింది. గాలే వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. భారత్ కు ఇది ల్యాండ్‌మార్క్ 600వ టెస్ట్ మ్యాచ్ కాగా, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత జట్టు 165 పరుగుల తేడాతో లంకను చిత్తు చేసి రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో అత్యంత కీలకమైన ఈ పోరులో యంగ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ మ్యాచ్ మొత్తంలో 10 వికెట్లు పడగొట్టి విజయకేతనం ఎగురవేశాడు. 372 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక, బుధవారం ఐదో రోజు పోస్ట్ లంచ్ సెషన్‌లో 77.4 ఓవర్లలో 206 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో సోనాల్ దినుష (84) మరోసారి టాప్ స్కోరర్ గా నిలిచాడు. రెండో టెస్టు కొలంబోలో ఈనెల 23 నుంచి జరుగుతుంది.




# అనుకున్న సమయానికే స్పిరిట్ విడుదల

## వాయిదా వార్తలను ఖండించిన టీమ్

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్ - వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. 'స్పిరిట్' షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. 'స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పూ లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని క్లారిటీ ఇచ్చింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి దిమ్రి కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.



# రాకాలో హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్



అగ్ర నటుడు అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ బ్జడెట్ మూవీ 'రాకా'. హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై మేకర్స్ గతేడాది నుంచి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కానుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అలాగే, షారుక్ ఖాన్ కూడా 'రాకా'లో భాగమేనని టాక్. విల్ స్మిత్, షారుక్, అల్లు అర్జున్ ఒకే ఫ్రేమ్‌లో వస్తే 'రాకా' భారీ సెన్సేషన్ మూవీ కావడం ఖాయమే. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో నలుగురు హీరోయిన్స్ ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చాయి. దీనిపై టీమ్ స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని పలు భాషల్లో 2027లో విడుదల చేయనున్నారు.




# టాక్సిక్.. పెద్దల సినిమా మాత్రమే

## పిల్లలు చూడొద్దన్న నటుడు యశ్

సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'టాక్సిక్ యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా గురించి యశ్ మాట్లాడుతూ ఇది కేవలం పెద్దవాళ్ల సినిమా అని స్పష్టం చేశారు. పిల్లలు ఈ సినిమా చూడొద్దు. ఇది పెద్దల కోసం మాత్రమే తీశాం. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను. పెద్దలకు తప్పొప్పులు తెలుసు. వాళ్లు ఈ సినిమా నుంచి ఏం నేర్చుకోవాలో నిర్ణయించుకుంటారు. జీవితంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే విచక్షణ వారికి ఉంటుంది. అందుకే వాళ్ల కోసమే చాలా నిజాయతీగా ఈ చిత్రం రూపొందించాం' అని చెప్పారు. ఇందులోని అశ్లీల సన్నివేశాల గురించి యశ్ మాట్లాడారు. విమర్శలను తోసిపుచ్చారు. 'ఈ చిత్రం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. కథ నిర్దిష్టమైన దిశకు చేరుకోవాలంటే ప్రతి పాత్రలోని వేర్వేరు పొరలను ఆవిష్కరించడం చాలా ముఖ్యం. ట్రైలర్, పాటలపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవి కేవలం రెండు పాత్రల మధ్య ప్రేమను ఆవిష్కరించే సన్నివేశాలు మాత్రమే. వాటిని అలా మాత్రమే చూడండి. గీతూ మోహన్‌దాస్ ఒక దర్శకురాలు.. మహిళలకు కూడా భావోద్వేగాలు పంచుకునే హక్కు ఉంటుంది. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, కథలోని ప్రాధాన్యతను బట్టే ఆయా సన్నివేశాలు చిత్రీకరించాం' అని యశ్ అన్నారు.



# బెట్టింగ్ యాప్స్ కేసు

## ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్

ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ బుధవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి (ప్రమోషన్‌కు) సంబంధించిన కేసులో అధికారులు ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఈడీ జారీ చేసిన సమన్ల మేరకు, నిధి అగర్వాల్ ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించి హవాలా మార్గాల్లో ద్వారా ఆమె నగదు లావాదేవీలు జరిపారన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ యాప్‌ల ప్రమోషన్ ద్వారా ఆమె అందుకున్న పారితోషికం, కమీషన్ల వివరాలపై అధికారులు ప్రధానంగా ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులను ఈడీ విచారించిన సంగతి తెలిసిందే. గతంలో ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి వంటి నటీనటులను అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఈ జాబితాలో నిధి అగర్వాల్ కూడా చేరారు. ప్రస్తుతం అధికారులు ఆమె నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్నారు.

# ఓటీటీలోకి శ్రీనివాస మంగాపురం

తెలుగు సినీ పరిశ్రమలోకి సూపర్ స్టార్ కృష్ణ మూడో తరానికి చెందిన వారసుడిగా ఘనంగా అడుగుపెట్టారు జయకృష్ణ ఘట్టమనేని. దివంగత నటుడు రమేష్ బాబు తనయుడైన జయకృష్ణ హీరోగా, బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ నూతన నాయికగా టాలీవుడ్‌కు పరిచయమైన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ రొమాంటిక్ యాక్షన్ అండ్ రస్టిక్ డ్రామా ఇటీవలే థియేటర్లలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. అయితే ఈ సినిమా వచ్చి 20 రోజులు కూడా కాకముందే సినిమా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకున్నారు మేకర్స్. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ద్వారా ఆగస్టు 20 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు అత్యంత కీలకమైన పాత్రలో నటించగా, కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రతిష్టాత్మక వైజయంతి మూవీస్ సంస్థ సమర్పించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ.

# ఆ వ్యక్తితో ప్రేమలో ఉన్నప్పుడు తీవ్ర క్షోభకు గురయ్యాను

నటి అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన పర్సనల్ లైఫ్‌కి సంబంధించిన అత్యంత చేదు అనుభవాలను బయటపెడుతూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెటిజన్లు, అభిమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గతంలో తాను ఒక వ్యక్తితో రెండేళ్ల పాటు ప్రేమలో ఉన్న సమయంలో తీవ్రమైన మానసిక క్షోభకు గురయ్యానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా స్త్రీలకు సహజంగా జరిగే పీరియడ్స్ ప్రక్రియను కూడా అతడు చాలా చులకనగా చూసేవాడని, అతని తప్పులను ప్రశ్నిస్తే "నీకు పీరియడ్స్ సమయమా? మూడ్ స్వింగ్స్ వల్లే ఇలా మాట్లాడుతున్నావు" అంటూ హేళన చేసేవాడని చెప్పారు. ఆ వ్యాఖ్యల వల్ల తన ఉనికిపై తనకే అసహ్యం వేసేదని, నటిగా సమాజంలో ధైర్యంగా నిలబడే తనకు ఆ సమయంలో తీవ్రమైన డిప్రెషన్ ఎదురైందని తెలిపారు. ఈ విషపూరితమైన బంధం వల్ల తన జీవిత ఆలోచనలే మారిపోయాయని ఆమె పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి తనకు 11 మంది పిల్లలు ఉండాలని కోరిక ఉండేదని, కానీ ఆ వ్యక్తి వల్ల కలిగిన చేదు అనుభవాల తర్వాత భవిష్యత్తులో అసలు పిల్లలే వద్దనే నిర్ణయానికి వచ్చానని వెల్లడించారు. ప్రస్తుతం ఆ మానసిక క్షోభ నుంచి బయటపడి కెరీర్‌పై దృష్టి పెడుతున్నట్లు అనుపమ తెలిపిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342